తెలుగు దినపత్రిక
https://aksharagalam.com
# అక్షరగళం
ప్రతి అక్షరం ప్రజల కోసం
పేజీలు: 8 వెల: 3 సంపుటి:3 సంచిక: 153
బుధవారం 05, నవంబర్ 2025
॥ ఎడిటర్: దయాకర్ రెడ్డి ॥

## యధావిధిగా జెఎన్‌టియూ ఫార్మసీ పరీక్షలు




హైదరాబాద్,నవంబర్4(అక్షరగళం): ఫీజు రియింబర్స్ మెంట్ నిధుల కోసం ప్రయివేటు కాలేజీల యాజమాన్యాలు చేపట్టిన బంద్ నేపథ్యంలో హైదరాబాద్‌లోని జవహర్ లాల్ నెహ్రూ టెక్నాలజీకల్ యూనివర్సిటీ కీలక ప్రకటన చేసింది. మంగళవారం నుంచి ప్రారంభం కావాల్సిన బీ ఫార్మసీ ఫస్టియర్ పరీక్షలు షెడ్యూల్ ప్రకారం జరుగుతాయని వీసీ కే వెంకటేశ్వర్ రావు ప్రకటించారు. ఉదయం ప్రారంభం కావాల్సిన ఎగ్జామ్స్ కొనసాగుతున్నాయని తెలిపారు. తదుపరి ఎగ్జామ్స్ కూడా నిర్వహిస్తామన్నారు. రూ. 10 వేల కోట్ల ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలు ఉండగా, ప్రస్తుతం రూ 5 వేల కోట్ల బకాయిలు విడుదల చేయాలని ప్రయివేటు కాలేజీల యాజమాన్యాలు డిమాండ్ చేస్తున్నాయి.



## ఛత్తీస్‌ఘడ్‌లో ఎదురెదురుగా ఢీకొన్న ప్యాసింజర్ గూడ్స్ రైలు

- ఏడుగురు మృతి, 15 మందికి తీవ్రగాయాలు
- మృతుల కుటుంబాలకు రూ. 10 లక్షల చొప్పున నష్టపరిహారం
- గాయపడిన వారికి రూ. 5 లక్షలు
- పాసింజర్ రైలు రెడ్ సిగ్నల్‌ను జంప్ చేయడం వల్లే ప్రమాదం..
- ఛత్తీస్‌గఢ్ రైలు ప్రమాదంపై రైల్వే బోర్డు

రాయపూర్,నవంబర్ 4(అక్షరగళం): ఛత్తీస్‌గఢ్‌లో రెండు రైళ్లు ఢీకొన్నాయి. మంగళవారం బిలాస్ పుర్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో పలువురు మృతి చెందినట్లు తెలుస్తోంది. సాయంత్రం నాలుగు గంటల సమయంలో లాల్‌ఖదాన్ ప్రాంతంలో మెము ప్యాసింజర్-గూడ్స్ రైళ్లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దాంతో పలు బోగీలు పట్టాలు తప్పాయి. ఈ ప్రమాదంతో బిలాస్‌పుర్-హావ్‌డా లైన్ మార్గంలో రైళ్లరాకపోకలకు పూర్తి అంతరాయం ఏర్పడింది. దాంతో పలు సర్వీసులను రద్దు చేశారు. మరికొన్నింటిని దారిమళ్లించారు. ఈ ఘటన వల్ల ఆ మార్గంలో ఎలక్ట్రిక్ వైర్లు, సిగ్నల్ వ్యవస్థలు దెబ్బతిన్నాయి. ప్రమాదంపై సమాచారం అందుకున్న అధికారులు ఘటనాస్థలికి చేరుకొని సహాయచర్యలు చేపట్టారు. వైద్య సిబ్బంది ప్రమాదస్థలికి చేరుకున్నారు. దెబ్బతిన్న కోచ్‌లను పట్టాల నుంచి తొలగిస్తున్నారు. మిగతా.. 2లో


## బీహార్‌లోనూ ఉచిత పథకాల వెల్లువ



- సంక్రాంతి కానుకగా మహిళల ఖాతాల్లో 30వేలు జమ
- మద్దతు ధరలకు అదనంగా 300,400 చెల్లింపులు
- సొంతూరికి 70 కి.మీ దూరంలోనే ఉద్యోగుల బదిలీలు
- మీడియా సమావేశంలో ఆర్‌జెడి నేత తేజస్వీయాదవ్

పాట్నా,నవంబర్4(అక్షరగళం): బీహార్ ఎన్నికల తరుణంలో ఆర్‌జెడి నేత, మహాగట్బంధన్ ముఖ్యమంత్రి అభ్యర్థిగా బరిలో నిలిచిన తేజస్వియాదవ్ ప్రజలకు వరాల జల్లు కురిపించారు. ముఖ్యంగా రైతులు పండించిన వరి గోధుమలకు మిగతా.. 2లో

## పార్టీ మారిన ఎమ్మెల్యేలపై విచారణ



- మరోమారు షెడ్యూల్ ప్రకటించిన స్పీకర్
- ఈ నెల 6నుంచి వరుసగా విచారణలకు సిద్ధం

హైదరాబాద్,నవంబర్4(అక్షరగళం): తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారిన పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసు విచారణలో మరో అడుగు పడింది. ఎల్లుండి నుండి ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసు విచారణ జరుగనుంది. ఈనెల 6 నుంచి ఈ కేసును స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ విచారించనున్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై విచారణకు మిగతా.. 2లో



# జూబ్లీహిల్స్‌లో 30వేలతో గెలుపు..!

- చెల్లిని గెంటేసిన నీచుడు కెటిఆర్
- రహమత్ నగర్ రోడ్‌షోలో సిఎం రేవంత్

హైదరాబాద్,నవంబర్ 4(అక్షరగళం): జూబ్లీహిల్స్‌లో 30 వేల మెజార్టీతో కాంగ్రెస్ జెండా ఎగరబోతుందని సీఎం రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నేపథ్యంలో భాగంగా మంగళవారం సీఎం రేవంత్ రెడ్డి రహమత్ నగర్‌లో రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ ఓటర్లను ఉద్దేశిస్తూ ప్రసంగం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఉప ఎన్నికలు వచ్చాయి.. మా అభ్యర్థి చనిపోయారు? ఆయన సతీమణికి ఓటేయండి అని అడుగుతున్నారని, పట్నం వచ్చిన పేదలకు ఉద్యోగ.. ఉపాధి అవకాశాలు కల్పించిన వ్యక్తి పీజేఆర్ అన్నారు. పీజేఆర్ ఆడబిడ్డల కోసం కృష్ణ జలాలు హైదరాబాద్ తీసుకువచ్చారని, పేదలకు ఇండ్ల స్థలాలు ఇచ్చింది పీజేఆర్ అని రేవంత్ రెడ్డి అన్నారు. అలాంటి పీజేఆర్ చనిపోతే.. ప్రత్యర్థిగా ఉన్న చంద్రబాబు కూడా పీజేఆర్ కుటుంబానికి మద్దతు ఇచ్చారని, కానీ కేసీఆర్ మాత్రం.. సెంటిమెంట్ లేదు.. ఏకగ్రీవం ఇచ్చేది లేదని పీజేఆర్ కుటుంబం మీద పోటీకి పెట్టారన్నారు. పీజేఆర్ కుటుంబంనీ కేసీఆర్ తన ఇంటి ముందు మూడు గంటలు కూర్చోపెట్టిన దుర్మార్గుడు కేసీఆర్ అని ఆయన మండిపడ్డారు. అంతేకాకుండా.. 'పాలేరులో రాంరెడ్డి వెంకట్ రెడ్డి చనిపోతే.. నారాయణపేటలో కృష్ణారెడ్డి చనిపోతే పోటీ పెట్టింది కేసీఆర్ కాదా.. ఆనాడు చేసిన తప్పులకు మిగతా.. 2లో

## అజారుద్దీన్‌కు మైనార్టీ సంక్షేమ శాఖ


- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం



హైదరాబాద్,నవంబర్ 4(అక్షరగళం): రాష్ట్ర మంత్రి అజారుద్దీన్‌కు ప్రభుత్వం శాఖ కేటాయించింది. అజారుద్దీన్‌కు మైనార్టీ సంక్షేమ శాఖతో పాటు పబ్లిక్ ఎంటర్ ప్రైజెస్ శాఖలు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత నెల 31వ తేదీన అజారుద్దీన్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సంగతి తెలిసిందే. మిగతా.. 2లో

## సిగాచీ ఉల్లంఘనలపై హైకోర్టులో కేసు

- కోటి పరిహారం ఎప్పుడు చెల్లిస్తారన్న కోర్టు



హైదరాబాద్,నవంబర్ 4(అక్షరగళం): సిగాచీ పరిశ్రమలో పేలుళ్ల ఘటనపై కలపాల బాబూరావు దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై తెలంగాణ హైకోర్టు విచారణ చేపట్టింది. సిగాచీ పేలుడు ఘటనలో 54 మంది మృతి చెందారని, ప్రమాదం మిగతా.. 2లో



## టిప్పర్ డ్రైవర్ నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణం

- చేవెళ్ల రోడ్డు ప్రమాదస్థలిని సందర్శించిన డిజిపి
- టిప్పర్ వేగంతోనే బస్సుకు ప్రమాదం
- దర్యాప్తులో పూర్తి వివరాలు తెలుస్తాయని వెల్లడి

హైదరాబాద్,నవంబర్ 4(అక్షరగళం): రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం మిర్జాగూడ వద్ద జరిగిన బస్సు ప్రమాదంపై పోలీసుల దర్యాప్తులో అన్ని విషయాలు వెల్లడవుతాయని తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ బస్సు ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం డీజీపీ శివధర్ రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. టిప్పర్ అతివేగంగా వచ్చి ఆర్టీసీ బస్సును ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగిందన్నారు. ప్రమాదం జరిగిన తీరు చూస్తే టిప్పర్ డ్రైవర్ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుందని డీజీపీ శివధర్ రెడ్డి పేర్కొన్నారు. ఇక రోడ్డు ప్రమాదానికి గురైన టిప్పర్ కండిషన్‌ను మెకానిక్ ద్వారా పరీశీలిస్తున్నా మన్నారు. దాదాపు 40 మీటర్లు టిప్పర్ లాక్కెళ్లడంతో ఈ ప్రమాద తీవ్రత పెరిగిందని వివరించారు. ఈ ప్రమాద సమయంలో ఆర్టీసీ బస్సులో రైట్‌సైడ్ కూర్చున్న వారు చాలా మంది తమ ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. అయితే రోడ్డు మలుపు ఉంది కానీ.. అది యాక్సిడెంట్ అయ్యేంత తీవ్రంగా లేదన్నారు. ఈ ప్రమాదంలో గాయపడిన టిప్పర్ లారీ ఓనర్ లక్ష్మణ్ నాయక్ ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాలను ప్రభుత్వ పరంగా చూడకూడదని.. ఇది అందరి బాధ్యతగా చూడాల్సి ఉందని ఈ సందర్భంగా ఆయన అభిప్రాయపడ్డారు.

## హైదరాబాద్‌లో మరిన్ని పెట్టుబడులు పెట్టాలి



- జర్మనీ కాన్సుల్ జనరల్ మైకేల్ హాస్పర్ బృందం భేటీలో సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్,నవంబర్ 4(అక్షరగళం): డ్యుయిష్ బోర్స్ కంపెనీ విస్తరణలో భాగంగా హైదరాబాద్‌లో మంగళవారం తమ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్‌ని హైదరాబాద్‌లో ప్రారంభిస్తున్నట్టు ముఖ్యమంత్రికి జర్మనీ బృందం తెలిపింది. జీసీసీ ఏర్పాటుకు హైదరాబాద్ ను ఎంచుకున్నందుకు మిగతా.. 2లో

## వ్యవసాయం మనజీవన విధానంలో భాగం

- 54 శాతం జనాభా వ్యవసాయంపై ఆధారపడి జీవనం
- దేశ జీడీపీలో 18 శాతం భాగస్వామ్యం కలిగి ఉంది
- 149 మిలియన్ టన్నుల ధాన్యం ఉత్పత్తితో ప్రపంచంలోనే తొలిస్థానం
- అగ్రి బిజినెస్ అవార్డుల ప్రదానంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



హైదరాబాద్,నవంబర్ 4(అక్షరగళం): దేశంలో ఎన్ని మార్పులు వచ్చినా.. వ్యవసాయం ఇప్పటికీ మన జీవన విధానంలో భాగమేనని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. దేశంలోని మిగతా.. 2లో

## రేవంత్.. ఫీజు బకాయిలు అడిగితే విద్యార్థులను బెదిరిస్తారా?

- భార్యలకు ఉచిత బస్సు ప్రయాణం.. భర్తలకు మాత్రం టికెట్ ధర రెట్టింపు
- లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును అంధకారం చేయడానికి కాంగ్రెస్ కుట్ర
- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా విద్యార్థులకు విద్యను దూరం చేయాలని కాంగ్రెస్ చూస్తోంది
- అదే కాంగ్రెస్ ఇప్పుడు జూబ్లీహిల్స్‌లో 'మరో అవకాశం' కోసం యాచిస్తోంది
- జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌ను ఓడించి, మోసపోయిన నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల తరపున బుద్ధి చెప్పండి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విజ్ఞప్తి




హైదరాబాద్,నవంబర్ 4(అక్షరగళం): ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు 10,000 కోట్లకు పైగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్దేశపూర్వకంగా నిలిపివేసి, తద్వారా లక్షలాది మంది పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఉన్నత విద్యను పొందే హక్కును దూరం చేస్తున్నారని భారాస వర్కింగ్ మిగతా.. 2లో

## ఫీజు రియంబర్స్‌మెంట్‌పై ప్రభుత్వం కీలక నిర్ణయం

- సంస్కరణలపై అధ్యయానికి కమిటీ ఏర్పాటు
- కమిటీలో ప్రొఫెసర్లు కంచ ఐలయ్య, కోదండరాంలకు చోటు

హైదరాబాద్,నవంబర్ 4(అక్షరగళం): రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానంలో మార్పులకు ప్రభుత్వం సంకల్పించింది. ఇందులో చాలా అవతకవకలతో పాటు, అక్రమాలు చోటుచేసుకుంటున్నా యన్న ఆరోపణల



నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఫీజుల చెల్లింపుల్లో తీవ్ర జాప్యం చోటు చేసుకొంటున్న నేపథ్యంలో కాలేజీ యాజమాన్యాలు ఆందోళనకు దిగాయి. కాలేజీల బంద్ కొనసాగి స్తున్నాయి. ఈ క్రమంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించి మిగతా.. 2లో



## అకాల వర్షంతో తడిసిపోయిన పత్తి, వరిధాన్యం

- ఉమ్మడి వరంగల్ జిల్లాలో మరోమారు వర్షం
- హైదరాబాద్‌లో పలుచోట్ల కురిసిన వర్షం

వరంగల్,నవంబర్4(అక్షరగళం): ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఉరుములతో వర్షాలు దంచికొట్టాయి. మంగళవారం ఉదయం నుంచి కుండపోత వానలు కురిశాయి. వరంగల్ నగరంలో ఒక్కసారిగా వాతావరణం మారింది. ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. సుమారు అరగంట పాటు కురిసిన కుండపోత వర్షానికి నగర రహదారులు చెరువులను తలపించాయి. దీంతో పలు చోట్ల ట్రాఫిక్‌జామ్ అయింది. వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. వర్షానికి ఎనుమాముల మార్కెట్‌లో పత్తి, మొక్కజొన్న తడిసిపోయింది. దీంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఏర్పడ్డ 'మొంథా' తుపాను ముంపు నుంచి ఇంకా వరంగల్, హనుమకొండ, కాజీపేట ప్రాంతాలు పూర్తిగా తేరుకోలేదు. మరోసారి మిగతా.. 2లో

తెలుగు దినపత్రిక https://aksharagalam.com అక్షరగళం ప్రతి అక్షరం ప్రజల కోసం

# వ్యవసాయం మనజీవన విధానంలో భాగం

(మొదటి పేజీ తరువాయి)

54 శాతం జనాభా ఇప్పటికీ వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని చెప్పుకొచ్చారు. వ్యవసాయ రంగం దేశ జీడీపీలో 18 శాతం భాగస్వామ్యం కలిగి ఉందని వివరించారు. అగ్రి బిజినెస్ అవార్డులు ఇవ్వడం ద్వారా భారతదేశ వ్యవసాయ రంగానికి ఎనలేని సేవలు అందిస్తున్న రైతులకు, ఇన్నొవేటర్స్, అగ్రిప్రెన్యూర్స్‌ని గౌరవించు కోవడమేనని పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్ పార్క్ హయత్ హోటల్‌లో అగ్రి బిజినెస్ అవార్డుల కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. రైతులు సుభిక్షంగా ఉంటేనే దేశం సుభిక్షంగా ఉంటుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ బలంగా నమ్ముతారని నొక్కిచెప్పారు. అందుకే అనేక పథకాలు రైతులకు మేలు చేసేలా రూపొందించారని తెలిపారు. ఈ ఏడాది చైనాను దాటేసి 149 మిలియన్ టన్నుల ధాన్యం ఉత్పత్తితో భారతదేశం ప్రపంచంలోనే తొలిస్థానంలో నిలిచిందని ఉద్ఘాటించారు. 2014 నుంచి 2015 మధ్యలో పాల



ఉత్పత్తి 63 శాతం పెరిగిందని చెప్పు కొచ్చారు. ఇప్పటికీ ప్రపంచంలోనే అత్యంత ఎక్కువ పాలు ఉత్పత్తి చేసే దేశంగా మనం నిలిచామని పేర్కొన్నారు. ఆత్మ నిర్భర భారత్ దిశగా దూసుకెళ్లేందుకు వ్యవసాయ రంగం కీలక పాత్ర పోషిస్తోందని ఉద్ఘాటించారు. పప్పు ధాన్యాల ఉత్పత్తిలో ప్రపంచలోనే తొలిస్థానంలో నిలిచామని వివరించారు. దేశంలో 26 మిలియన్ టన్నుల పప్పు ధాన్యాల ఉత్పత్తి జరుగుతోందని వెల్లడించారు. కరోనా సమయంలో ప్రపంచవ్యాప్తంగా సరఫరా విషయంలో ఎన్ని ఇబ్బందులు తలెత్తినా ఆహార ధాన్యాలు సరఫరా జరిగేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. వేరే దేశాలకు కూడా భారతదేశం నుంచి ఎగుమతి చేశామని వివరించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో దేశంలోని 80 కోట్ల మందికి ఉచితంగా 5 కేజీల చొప్పున బియ్యం ఇస్తున్నామని తెలిపారు. పీఎం కిసాన్, పీఎం కృషి సించాయి యోజన వంటి అద్భుతమైన పథకాలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు కిషన్‌రెడ్డి. 2019లో పీఎం సమ్మాన్ నిధి యోజన ప్రారంభించినప్పటి నుంచి 11.8 కోట్ల మంది రైతులకు 21 విడతల్లో రూ.4 లక్షల కోట్ల నగదు రైతుల ఖాతాల్లో జమ చేశామని స్పష్టం చేశారు. ఈ పథకం ద్వారా చిన్న, మధ్య తరహా రైతులకు భరోసా దక్కిందని నొక్కిచెప్పారు. దళారుల ప్రమేయం లేకుండా రైతులు లబ్ధి పొందుతున్నారని వివరించారు. 2014 నుంచి ఇప్పటివరకు వరి ధాన్యం కనీస మద్దతు ధర భారీగా పెంచామని వెల్లడించారు. జీఎస్టీ 2.0 ద్వారా రైతులకు ఉపయోగపడేలా ట్రాక్టర్లు, మెషీన్లపై భారీగా జీఎస్టీ తగ్గించామని ప్రకటించారు. జీఎస్టీ తగ్గించడంతో రైతులకు ఎంతో మేలు జరుగుతోందని చెప్పుకొచ్చారు. సాగు ఖర్చు కూడా భారీగా తగ్గి, రైతుల ఆదాయం మరింత పెరుగుతుందని తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, డ్రోన్స్ వంటి అగ్రి టెక్నాలజీ ద్వారా వ్యవసాయ రంగాన్ని మరింతగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

# అకాల వర్షంతో తడిసిపోయిన పత్తి, వరిధాన్యం



(మొదటి పేజీ తరువాయి)

వర్షాలు కురవడంతో లోతట్టుప్రాంత ప్రజల్లో ముంపు భయం నెలకొంది. వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, రంగారెడ్డి, మహబూబ్ నగర్, వనపర్తి, నాగర్ కర్నూల్, నారాయణపేట, గద్వాల్, మేడ్చల్ – మల్కాజిగిరి, యాదాద్రి – భోంగీర్ వంటి పశ్చిమ, మధ్య, దక్షిణ తెలంగాణలో అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు పడుతాయని తెలంగాణ వెదర్ మ్యాన్ అంచనా వేశారు. రాజన్న సిరిసిల్ల, నల్గొండ, సూర్యాపేట, ఖమ్మం, మహబూబాబాద్, హన్మకొండ, వరంగల్, జనగాం జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మేయర్ గుండు సుధారాణి, స్థానిక కార్పొరేటర్, సంబంధిత అధికారులతో కలిసి జీడబ్ల్యూఎంసీ పరిధిలోని 11వ డివిజన్ పోతన నగర్‌లో క్షేత్ర స్థాయి పర్యటన నిర్వహించారు. నాళాల భౌతిక స్థితి పరిశీలించి, వరద నీరు నిల్వ ఉండకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా నిరంతర పర్యవేక్షణ కొనసాగించాల సూచించారు. ఇదిలావుంటే హైదరాబాద్‌లో మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. పలుచోట్ల జల్లులు కురిసాయి. రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కుస్తాయనివాతావరణ శాఖ తెలిపింది. ఉమ్మడి హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, మెదక్, నిజామాబాద్, నిర్మల్ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. ఇప్పటికే ఉమ్మడి వరంగల్, నల్లగొండతోపాటు పలు జిల్లాల్లో భారీ వాన కురుస్తున్నది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఉదయం భారీ వర్షం పడింది. సుమారు అరగంటపాటు ఈదురు గాలులతో కూడిన వాన కుండపోతగా కురిసింది. దీంతో రహదారులు జలమయమయ్యాయి. ఇక నల్లగొండ జిల్లాలో భారీ వర్షం కురుస్తున్నది. అరేబియా సముద్రం నుంచి తెలంగాణ వైపు తేమ గాలులు వీస్తున్నాయి. దీంతో రాష్ట్రంలో సాధారణం కంటే 2 నుంచి 3 డిగ్రీలు అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గురువారం నుంచి పొడి వాతావరణం కొనసాగే అవకాశం ఉందని తెలిపింది.

# అజారుద్దీన్‌కు మైనార్టీ సంక్షేమ శాఖ

(మొదటి పేజీ తరువాయి)

ప్రమాణస్వీకారం చేసిన నాలుగు రోజులకు అజారుద్దీన్‌కు శాఖ కేటాయించారు. మొత్తంగా రాష్ట్ర కేబినెట్‌లో మంత్రుల సంఖ్య 15కు చేరింది. మరో రెండు మంత్రి పదవులు ఖాళీగా ఉన్నాయి. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో మైనార్టీల ఓట్లను ఆకర్షించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇచ్చిన సంగతి తెలిసిందే. 'బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ ముస్లింకు హోంశాఖ ఇచ్చారు. ఇప్పుడు కూడా హోంశాఖను నాకు కేటాయించి ముస్లిం మైనార్టీలకు ప్రాధాన్యం కల్పించాలి' అని అజారుద్దీన్ సీఎం రేవంత్‌ను కోరినట్టు విశ్వసనీయవర్గాలు తెలిపాయి. తనకు హోం శాఖ ఇస్తేనే ముస్లిం మైనార్టీలు ప్రభుత్వాన్ని నమ్ముతారని, జూబ్లీహిల్స్ ఎన్నికల వేళ అనవసర చర్చలకు తావులేకుండా శాఖల కేటాయింపు వీలైనంత త్వరగా ముగించాలని అజారుద్దీన్ కోరినట్టు తెలిసింది. దీనికి సీఎం రేవంత్‌రెడ్డి తన వద్ద ఉన్న కీలక శాఖలు ఎవరికీ ఇచ్చేది లేదని, మైనార్టీ వెల్ఫేర్ మంత్రిగా బాధ్యతలు స్వీకరించాలని చెప్పినట్టు సమాచారం. జూబ్లీహిల్స్‌లో ఓడినా పోయేదేమీ లేదు.. హోంశాఖ మాత్రం ఇంకొకరికి ఇచ్చే ప్రసక్తి లేదని తెగేసి చెప్పినట్టు ప్రచార అవుతున్నది. ఆ మేరకే అజారుద్దీన్‌కు మైనార్టీ సంక్షేమ శాఖ, పబ్లిక్ ఎంటర్ ప్రైజెస్ శాఖలు కట్టబెట్టినట్లు తెలుస్తోంది.

# సిగాచీ ఉల్లంఘనలపై హైకోర్టులో కేసు

(మొదటి పేజీ తరువాయి)

జరిగి నాలుగు నెలలు గడిచినా ఇప్పటి వరకు ఎవరినీ అరెస్టు చేయలేదని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. బాధితులకు ఇస్తామన్న రూ.కోటి పరిహారం కూడా ఇవ్వలేదని, ఎన్నో ఉల్లంఘనలు జరిగినట్టు దర్యాప్తులో తేలిందని వివరించారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం పాశమైలారంలోని సిగాచీ కంపెనీ ఎండీకి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. మృతులు, బాధిత కుటుంబాలకు పరిహారం చెల్లింపులో కౌంటరు దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను ఉన్నత న్యాయస్థానం రెండు వారాలకు వాయిదా వేసింది. నిపుణుల కమిటీ నివేదికను విశ్లేషిస్తున్నామని అదనపు అడ్వొకేట్ జనర్ రజనీకాంత్ తెలిపారు. 192 మంది ప్రత్యక్ష సాక్షుల నుంచి పోలీసులు వాంగ్మూలం సేకరించారు. సిగాచీ కంపెనీకి చెందిన వైస్ ప్రెసిడెంట్ సైతం ప్రమాదంలో చనిపోయారు. నిపుణుల కమిటీ నివేదిక ఆధారంగా పోలీసులు చర్యలు తీసుకోనున్నారు' అని కోర్టుకు తెలిపారు. బాధితులకు రూ.కోటి పరిహారం ఎప్పుడు చెల్లిస్తారని ఈ సందర్భంగా హైకోర్టు ప్రశ్నించింది. మృతుల కుటుంబాలకు రూ.25లక్షలు చెల్లించామని, కంపెనీ నుంచి మిగతా డబ్బులు వచ్చేలా చూస్తున్నామని ఏఏజీ వివరణ ఇచ్చారు. రెండు వారాల్లో సమగ్ర వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఏఏజీని హైకోర్టు ఆదేశించింది.

# ఫీజు రియంబర్స్‌మెంట్‌పై ప్రభుత్వం కీలక నిర్ణయం

(మొదటి పేజీ తరువాయి)

సంస్కరణలపై కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం మంగళవారం ప్రకటిం చింది. అందుకు సంబంధించిన ఉత్తర్వులను జారీ చేసింది. స్పెషల్ చీఫ్ సెక్రటరీతో పాటు 15 మందితో ఈ కమిటీని నియమించింది. ఇక కాలేజీల నుంచి ఈ కమిటీలో ముగ్గురికి చోటు కల్పిస్తున్నట్లు జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది. అలాగే ఈ కమిటీలో ప్రొఫెసర్లు కంచ ఐలయ్య, కోదండరాంలకు చోటు కల్పించినట్లు స్పష్టం చేసింది. ఈ కమిటీ.. ఫీజు రీయింబర్స్‌మెంట్ పాలసీపై ప్రభుత్వానికి సూచనలు ఇవ్వనుంది. అలాగే ప్రత్యేక ట్రస్ట్ ద్వారా ఫీజు రీయింబర్స్‌మెంట్ సాధ్యాసాధ్యాలను ఈ కమిటీ పరిశీలిస్తుంది. మూడు నెలల్లో ఈ కమిటీ నివేదిక అందజేయాలని ప్రభుత్వం జారీ చేసిన జీవోలో స్పష్టంగా సూచించింది. అలాగే విద్యా సంస్థలు స్పష్టం చేసిన సూచనలపై సైతం అధ్యయనం చేయాలని ఈ సందర్భంగా కమిటీకి రాష్ట్ర ప్రభుత్వం సూచించింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో ప్రైవేట్ కాలేజీల యాజమాన్యం, ప్రభుత్వానికి మధ్య దూరం బాగా పెరుగుతోంది. సమయానికి ప్రభుత్వం ఈ ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో.. కాలేజీ యాజమాన్యం తమ కళాశాలల బంద్‌కు పిలుపునిస్తుంది. ఆ క్రమంలో కాలేజీ యాజమాన్యంతో ప్రభుత్వం చర్చలు జరుపుతోంది. దీంతో వాయిదాల రూపంలో నగదు చెల్లిస్తామంటూ కాలేజీల యాజమాన్యానికి ప్రభుత్వం తెలుపుతోంది. అందుకు ఆ కాలేజీల యాజమాన్యం సానుకూలంగా స్పందించకుండా ఆందోళనలకు దిగింది.

# హైదరాబాద్‌లో మరిన్ని పెట్టుబడులు పెట్టాలి

(మొదటి పేజీ తరువాయి)

జర్మనీ బృందానికి సీఎం ధన్యవాదాలు తెలిపారు. హైదరాబాద్‌లో మరిన్ని పెట్టుబడులు పెట్టాలని, ఇందుకు ప్రజాప్రభుత్వం పూర్తి మద్దతుగా నిలిచి అన్నిరకాల సహాయ సహకారాలు అందిస్తుందని సీఎం భరోసా ఇచ్చారు. హైదరాబాద్ డ్యుయిష్ బోర్స్ కంపెనీ జీసీసీ ఏర్పాటుతో వచ్చే రెండేళ్లలో ఐటీ రంగంలో వెయ్యి మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలగనున్నట్లు సీఎంకు వివరించింది. హైదరాబాద్‌లో ఇన్నోవేషన్ హబ్‌గా తయారు చేసేందుకు సహకరించాలని, హైదరాబాద్‌లో జర్మనీ టీచర్లను నియమించి తెలంగాణ విద్యార్థులకు జర్మనీ భాషను నేర్పించేందుకు సహకరించాలని జర్మనీ బృందాన్ని సీఎం కోరారు. పెట్టుబడుల విషయంలో తెలంగాణ జర్మనీ భాగస్వామ్యాన్ని కోరుకుంటోందని, ఐటీ, ఫార్మా, ఆటోమొబైల్ రంగంలో జర్మనీ కంపెనీలు పెట్టుబడులు పెట్టాలని విజ్ఞప్తి చేశారు. వీటితో టామ్ కాం ద్వారా వొకేషనల్ ఎడ్యుకేషన్, స్కిల్ వర్క్ విషయంలో శిక్షణ అందించేందుకు సహకరించాలని కోరారు.

ఈ భేటీలో అమిత దేశాయ్, డ్యుయిష్ బోర్స్ సీఐవో/సీవోవో డాక్టర్ క్రిస్టోఫ్ బోమ్, సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ మారిన ఎమ్మెల్యేలపై విచారణ

(మొదటి పేజీ తరువాయి)

అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ షెడ్యూల్ ఇచ్చారు. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ గుర్తుపై గెలిచిన పదిమంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం తెలిసింది. దీంతో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలంటూ బీఆర్ఎస్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీంతో మూడు నెలల్లోగా విచారించి నిర్ణయం వెల్లడించాలని సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం జూలై 31న తీర్పునిచ్చింది. ఈ నేపథ్యంలో నలుగురు ఎమ్మెల్యే విచారణను పూర్తిచేసిన స్పీకర్.. తాజాగా ఈ నెల 6 నుంచి మరో నలుగురు ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్ రెడ్డి, అరికెపూడి గాంధీ, తెల్లం వెంకట్రావు, డాక్టర్ సంజయ్ అనర్హతపై విచారణ చేపట్టనున్నారు. నవంబర్ 6న తెల్లం వెంకట్రావ్, సంజయ్ పిటిషన్లను విచారిస్తారు. ఈ నెల 7న పోచారం శ్రీనివాస్ రెడ్డి, అరికెపూడి గాంధీని విచారించనున్నారు. 12న తెల్లం వెంకట్రావ్, సంజయ్ పిటిషన్లపై రెండోసారి విచారణ కొనసాగనుంది.. 13న పోచారం, అరికెపూడి గాంధీల పిటిషన్లపై మరోసారి విచారణ నిర్వహిస్తారు. కాగా.. సుప్రీంకోర్టు ఇచ్చిన గడువు గత నెల 31న ముగిసిన విషయం తెలిసిందే. దీంతో నాలుగు రోజుల క్రితం ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై విచారణకు మరో రెండు నెలల గడువు ఇవ్వాలని శాసనసభ స్పీకర్ కార్యాలయం సుప్రీంకోర్టును కోరింది. నలుగురు ఎమ్మెల్యేల విచారణ మాత్రమే పూర్తయిందని.. అంతర్జాతీయ సదస్సులు ఉండటంతో గడువు సరిపోలేదని దేశ అత్యున్నత న్యాయస్థానానికి తెలిపింది. 6వ తేదీన భద్రాచలం నియోజకవర్గ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, జగిత్యాల నియోజకవర్గ ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌లను విచారించనున్నారు. 13న కామారెడ్డి ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ కేసు విచారించనున్నారు. ఇప్పటికే నలుగురు ఎమ్మెల్యేలను స్పీకర్ విచారించిన విషయం తెలిసిందే.అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచిన 10 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ నేతలు స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. స్పీకర్ నుంచి సరైన స్పందన రాకపోవడంతో హైకోర్టును ఆశ్రయించారు. అత్యున్నత న్యాయస్థానం నుంచి బీఆర్ఎస్‌కు సానుకూల తీర్పు రాకపోవడంతో సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. ఈ మేరకు విచారణ చేపట్టిన సర్వోన్నత న్యాయస్థానం.. ఈ వ్యవహారంపై మూడు నెలల్లోగా స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని జూలై 31న ఆదేశాలు జారీ చేసింది. కాగా, ఆ గడువు అక్టోబర్ 31తో ముగిసింది. దీంతో పార్టీ మారిన ఎమ్మెల్యేలను స్పీకర్ విచారించనున్నారు.

# బీహార్‌లోనూ ఉచిత పథకాల వెల్లువ

(మొదటి పేజీ తరువాయి)

ఎంఎస్‌పి ధర కంటే అదనపంగా క్వింటాలకు రూ. 300, 400 చొప్పున చెల్లించనున్నట్లు హామీనిచ్చారు. మహిళల బ్యాంకు ఖాతాలో 30 వేల చొప్పున జమ చేస్తామని, ప్రభుత్వ ఉద్యోగులైన పోలీసులు, టీచర్లు, ఆరోగ్య కార్యకర్తల బదిలీలు వారి సొంత ఇంటికి 70 కిలోమీటర్లలోపే బదిలీలు ఉంటాయని ప్రకటించారు. ఇప్పటికే ఇంటికో ఉద్యోగం ప్రకటించిన తేజస్వీ ఎన్‌డిఎ కూటమిని దెబ్బతీసేందుకు అలవికాని హామీలు ఇస్తున్నారు. తాజాగా బిహార్ ఎన్నికల్లో మహిళా ఓటర్లను ఆకట్టుకునేందుకు ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ కీలక హామీ ప్రకటించారు. మంగళవారం తేజస్వియాదవ్ పాట్నాలో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. ఇండియా కూటమి బిహార్‌లో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసిన వెంటనే 'మై-బహిన్ మాన్ యోజన'ను ప్రారంభిస్తామన్నారు. ఇందులోభాగంగా జనవరి 14న సంక్రాంతి రోజున రాష్ట్రంలోని మహిళలకు ఏడాదికి రూ.30వేలు కానుకగా అందచేస్తామని వెల్లడించారు. ఎన్నికలు సమీపిస్తోన్న తరుణంలో బిహార్ ప్రభుత్వం ఇటీవల అక్కడి మహిళలకు నవరాత్రి కానుకగా ఒక్కొక్కరికీ రూ.10వేలు చొప్పున 75 లక్షల మంది మహిళల ఖాతాల్లో డబ్బు జమ చేసిన నేపథ్యంలో తేజస్వీ ఈ ప్రకటన చేశారు. గత వారం ప్రతిపక్షాలు విడుదల చేసిన మ్యానిఫెస్టో ప్రకారం.. డిసెంబర్ 1 నుంచి మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సహాయంగా రాబోయే ఐదేళ్లు ఒక్కో సంవత్సరానికి మొత్తం రూ.30,000 ఇస్తామని తేజస్వీ హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఇందులోభాగంగానే అధికారంలోకి వచ్చిన వెంటనే మొదటి ఏడాదికి గాను మహిళలకు రూ.30వేలు ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. బిహార్ మహిళల కోరిక మేరకు ఏడాదికి చెల్లించే మొత్తం రూ.30 వేలను జనవరి 14న వారి ఖాతాలకు బదిలీ చేస్తామని తేజస్వీ తెలిపారు. కనీస మద్దతు ధర (ఓ÷ూఖ)తో పాటు బోనస్‌గా రైతులకు క్వింటాలు వరికి రూ.300, గోధుమలకు రూ.400 చెల్లిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల కోసం పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. అంతేకాకుండా పోలీసు సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, ఉపాధ్యాయులు వంటి అన్నిరకాల ప్రభుత్వ సిబ్బందికి వారి సొంత జిల్లాల నుంచి 70 కిలోమీటర్ల పరిధిలో నియామకాలు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. కాగా బిహార్ ఎన్నికల నేపథ్యంలో విపక్ష కూటమి మహాగఠ్‌బంధన్ ఇటీవల 'తేజస్వీ ప్రతిజ్ఞా ప్రణ్' పేరుతో తమ మ్యానిఫెస్టోను విడుదల చేసింది. అందులో తాము అధికారంలోకి వస్తే ప్రతి కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం, పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ తదితర హామీలను అమలు చేస్తామని పేర్కొంది.. రైతులకు నీటి పారుదల కోసం ఉచిత విద్యుత్ అందిస్తాము. మై బహీన్ మాన్ యోజన పథకం కింద మహిళల బ్యాంకు ఖాతాల్లో జనవరి 14వ తేదీకల్లా రూ. 30,000లు జమ చేస్తాం.

ఇది సంవత్సరం మొత్తానికి వర్తిస్తుంది. నూతన సంవత్సరం, మకర సంక్రాంతి పండుగల సందర్భంగా ముందుగానే నగదును జమ చేస్తాం. నిత్యవసర ధరలు పెరిగిన ఈ సమయంలో.. ఈ డబ్బుతో వారికి కొంత ఆర్థిక ఉపశమనం లభిస్తుంది. రాష్ట్రంలోని మా తల్లులు, సోదరీమణుల డిమాండ్ల మేరకే మా ప్రభుత్వం ఏర్పడుతుంది' అని ఆయన అన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమానికి మహాగట్బంధన్ కట్టుబడి ఉందని తేజస్వి తెలిపారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే.. పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు, ఆరోగ్య కార్యకర్తల బదిలీలు వారి ఇంటి నుండి 70 కిలోమీటర్ల లోపే వారి బదిలీలు చేస్తాము. బదిలీల పోస్టింగ్‌లో కచ్చితంగా ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకుంటాము. దీన్నే మ్యానిఫెస్టోలో కూడా ప్రస్తావించాము అని తేజస్వి అన్నారు.

# రేవంత్.. ఫీజు బకాయిలు అడిగితే విద్యార్థులను బెదిరిస్తారా?

(మొదటి పేజీ తరువాయి)

ప్రెసిడెంట్ కె.టి. రామారావు కాంగ్రెస్పై విరుచుకు పడ్డారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంకే జరుగుతున్న ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమాజి గూడలో నిర్వహించిన భారీ రోడ్‌షోలో కేటీఆర్ మాట్లా డుతూ, ఫీజు రియంబర్స్మెంట్ పథకంపై ఆధారపడిన వేలాది కుటుంబాల ఆశయాలను నాశనం చేసి, తెలంగాణ విద్యావంతులైన యువతను బలహీనపరిచే ందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ధ్వజమెత్తారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయకుండా, మనుగడ కోసం పోరాడుతున్న ప్రైవేట్ కళాశాలలు, విద్యా సంస్థలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం భయభ్రాంతులకు గురిచేస్తోందని కేటీఆర్ అన్నారు. "బకాయిలు చెల్లించకపోవడం ద్వారా దళిత, ఆదివాసీ, బహుజన, పేద అగ్రకుల విద్యార్థులను విద్యకు



దూరం చేస్తున్నారు. ఇది కేవలం నిర్లక్ష్యం కాదు, అణగారిన వర్గాల ఆశలను అణిచివేసేందుకు పన్నిన పన్నాగం" అని కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న డొల్ల మాటలను ఎద్దేవా చేస్తూ, "విద్యార్థుల ఫీజులు కూడా చెల్లించలేని ముఖ్యమంత్రి, జూబ్లీహిల్స్ ప్రజలకు మాత్రం ఏం చేయగలరు?" అని కేటీఆర్ ప్రశ్నించారు. పేదరికం కారణంగా ఏ విద్యార్థి కూడా విద్యకు దూరం కాకూడదనే లక్ష్యంతో ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ఇప్పుడు రేవంత్ రెడ్డి పాలనలో నిర్వీర్యమైందని ఆయన గుర్తు చేశారు. "వ్యవస్థను బలోపేతం చేయాల్సింది పోయి, సంస్థలను బెదిరించి భయాందోళనలు సృష్టిస్తున్నారు" అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. వృద్ధులకు 4,000 పెన్షన్, కోడళ్ళకు 2,500 భత్యం, యువతులకు స్కూటర్లు, రైతులకు 15,000 సాయం, 2 లక్షల రుణమాఫీ, రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీలన్నీ ఏమయ్యాయి? ఒక్కటీ నెరవేరలేదు" అని కేటీఆర్ ప్రశ్నించారు. కేసీఆర్ ప్రభుత్వం ప్రారంభించిన రైతుబంధు, రైతుబీమా, కేసీఆర్ కిట్లు, బతుకమ్మ చీరలు, రంజాన్, క్రిస్మస్ కానుకలు వంటి అన్ని సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేసిందని, హైదరాబాద్‌లో ఉచిత నీటి సరఫరా పథకాన్ని కూడా ఆపివేసిందని ఆయన అన్నారు. "భార్యలకు ఉచిత బస్సు ప్రయాణం అంటారు, కానీ భర్తలకు మాత్రం టికెట్ ధరను రెట్టింపు చేశారు. ఇదేనా వాళ్ళు చెప్పే సంక్షేమం?" అని చురక అంటించారు.

కేసీఆర్ నాయకత్వంలో హైదరాబాద్ రూపురేఖలు మారిపోయాయని కేటీఆర్ గుర్తు చేస్తూ, 2014కి ముందు నగరంలో కరెంటు కోతలు, నీటి కొరత తీవ్రంగా ఉండేవని అన్నారు. "ప్రతి ఇంట్లో ఇన్వర్టర్ ఉండేది, ప్రతి వేసవిలో నీటి కొరత తప్పేది కాదు. కానీ, కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక, తెలంగాణ నిరంతర విద్యుత్, స్వచ్ఛమైన తాగునీరు, వేగవంతమైన పట్టణాభివృద్ధికి నమూనా రాష్ట్రంగా మారింది. 3 లక్షల నుంచి 10 లక్షల ఐటీ ఉద్యోగాలు సృష్టించాం, పరిశ్రమలను విస్తరించాం, శాంతిభద్రతలను కాపాడాం" అని ఆయన వివరించారు.

"ఇది సాధారణ ఎన్నిక కాదు, కారు కు, బుల్డోజర్ కు మధ్య జరుగుతున్న పోరాటం. బుల్డోజర్ ప్రభుత్వాన్ని ఆపడానికి ప్రజలు కారు గుర్తుకే ఓటు వేయాలి" అని స్పష్టం చేశారు. మోసపోయిన నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల తరపున కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పడానికి ఈ ఉప ఎన్నికను ఉపయోగించుకోవాలని కేటీఆర్ జూబ్లీహిల్స్ ఓటర్లను కోరారు. భారీ కరతాళ ధ్వనుల మధ్య తన ప్రసంగాన్ని ముగిస్తూ, కేటీఆర్, "ఈ ఎన్నిక పదేళ్ల అభివృద్ధికి, రెండేళ్ల గందరగోళానికి మధ్య జరుగుతున్న పోరాటం. తేడా ఏంటో ప్రజలు చూశారు. ఇప్పుడు తెలంగాణ భారాసతో ముందుకు సాగాలా లేక కాంగ్రెస్‌తో వెనక్కి వెళ్లాలా అని నిర్ణయించుకోవాల్సిన సమయం వచ్చింది. నవంబర్ 11న కారు గుర్తుకు ఓటు వేసి, తెలంగాణ భవిష్యత్తును రక్షించండి" అని పిలుపునిచ్చారు.

# జూబ్లీహిల్స్‌లో 30వేలతో గెలుపు..!

(మొదటి పేజీ తరువాయి)

బీఆర్ఎస్ నేతలు క్షమాపణ చెప్పాలి. ఆడబిడ్డ ఎవరికైనా ఆడబిడ్డనే.. నీ సొంత చెల్లెలి కి వాటా ఇవ్వాల్సి వస్తుందని చెల్లిని బయటకు పంపిన కసాయి కేటీఆర్ కాదా.. అని కెటిఆర్‌ను ఉద్దేశించి విమర్శించారు. సొంత చెల్లెల్ని బయటకు గెంటేసి నీచుడు కేటీఆర్..మీ సొంత అన్న ఇట్లనే అవమానిస్తే.. ఊరుకుంటారా..? వేలకోట్లు కొల్లగొట్టుకున్న వ్యక్తి కేటీఆర్.. పావలా వంతు అయినా.. చెల్లికి ఇవ్వచ్చు కదా.. మహిళా సెంటిమెంట్ గురించి మాట్లాడుతున్నాడు.. ఐదేళ్లు మంత్రి పదవులు ఇవ్వకుండా అవమానించినది నువ్వు కాదా..? ఇందిరాగాంధీ దేశాన్ని కాంగ్రెస్ పార్టీ నీ నడపలేదా.. సోనియా గాంధీ.. ప్రియాంక గాంధీ కాంగ్రెస్ నీ నడపడం లేదా..? పదేళ్లలో ఈ పనికి మాలిన వాడు రేషన్ కార్డు ఇచ్చాడా.. ఫార్మ్ హౌస్ లో మీరు ఏమైనా వాటా అడిగారా..? రేషన్ కార్డు ఒక్కటే కదా మీరు అడిగిందని సీఎం రేవంత్ రెడ్డి విమర్శలు గుప్పించారు. మీతోనే నిరంతరం ఉండే నవీన్ యాదవ్ గెలిస్తే మీ వెంటే ఉండి సమస్యలు పరిష్కరిస్తాడని అన్నారు.

# చేవెళ్ల బస్సు ప్రమాద ఘటన

## సుమోటోగా కేసు నమోదు చేసిన మానవహక్కుల సంఘం

హైదరాబాద్,నవంబర్ 4(అక్షరగళం): రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో జరిగిన బస్సు ప్రమాద ఘటన ఎన్నో కుటుంబాల్లో విషాదాన్ని నింపింది. తమ వారిని కోల్పోయి కుటుంబసభ్యులు గుండెలవిసేలా రోదించారు. చేవెళ్ల బస్సు ప్రమాద ఘటనను రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ సుమోటోగా కేసు నమోదు చేసింది. మీడియా ఛానల్స్, పలు పత్రికల్లో వచ్చిన కథనాల ఆధారంగా కమిషన్ చర్యలు తీసుకుంది. ఈ సంఘటనపై డిసెంబర్ 15లోగా సమగ్ర నివేదిక సమర్పించాలని రోడ్లు రవాణా, భవనాల శాఖ, హోంశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీలకు కమిషన్



ఆదేశాలు జారీ చేసింది. రంగారెడ్డి జిల్లా కలెక్టర్, ఆర్టీసీ ఎండీ, నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా హైదరాబాద్ రీజినల్ ఆఫీసర్ కు కూడా నివేదిక సమర్పించాలని హెచ్ఆర్సీ ఆదేశించింది. మరోవైపు చేవెళ్ల బస్సు ప్రమాదంపై పోలీసుల విచారణ కొనసాగుతోంది. ప్రమాదం జరిగిన స్థలాన్ని డీజీపీ శశిధర్ రెడ్డి, సీపీ అవినాష్ మహంతి, ఇతర పోలీస్ ఉన్నతాధికారులు పరిశీలించారు. నిన్న(సోమవారం) తెల్లవారు జామున తాండూరు నుంచి హైదరాబాద్‌కు బయలుదేరిన ఆర్టీసీ బస్సు చేవెళ్ల మండలం మిర్జాగూడ వద్ద ఘోర రోడ్డు ప్రమాదానికి గురైంది. బస్సును కంకర లోడ్‌తో వెళ్తున్న లారీ బలంగా ఢీకొట్టింది. దీంతో లారీలో ఉన్న కంకర మొత్తం బస్సులో కుప్పగా పడిపోయింది. ఈ ప్రమాదంలో 19 మంది అక్కడికక్కడే మృతి చెందారు. మరో 34 మంది గాయపడటంతో వారిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. టిప్పర్ అతివేగం కారణంగానే ప్రమాదం జరిగిందని పోలీసులు నిర్ధారించారు.



తెలుగు దినపత్రిక https://aksharagalam.com

# అక్షరగళం

ప్రతి అక్షరం ప్రజల కోసం

తెలంగాణ రౌండప్


## సీఎం ప్రజావాణిలో 238 దరఖాస్తులు

### - దరఖాస్తులు స్వీకరించిన చిన్నారెడ్డి



**హైదరాబాద్:** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో మంగళవారం నిర్వహించిన సీఎం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 238 దరఖాస్తులు అందాయి. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 51, రెవెన్యూ శాఖకు సంబంధించి 46, మున్సిపల్ శాఖకు 23, ఇందిరమ్మ ఇండ్ల కోసం 67, ప్రవాసి ప్రజావాణికి 02 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 49 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. సీఎం ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు.



## మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

### నాగారం మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ రెడ్డి

**కీసర,నవంబర్ 04,(అక్షర గళం):**
మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్లు నాగారం మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ రెడ్డి అన్నారు.మంగళవారం నాగారం పురపాలక సంఘం పరిధిలోని గోధుమకుంట ఎలిఫెంట్ ఎంక్లేవ్ కాలనీ వాసుల పిలుపుమేరకు రూ.10 లక్షల వ్యయంతో చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ పనులకు నాగారం మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిధులుగా పాల్గొని గోధుమకుంట మాజీ ఎంపిటిసి మంచాల కిరణ్ జ్యోతి ప్రవీణ్ కుమార్ తో కలిసి ఆయన శంకుస్థాపన




చేశారు.ఈ సందర్బంగా ముప్పు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంతో పట్టణాలు అభివృద్ధి జరుగుతుందన్నారు.అన్ని వార్డు లల్లో మౌలిక వసతుల కల్పనకు తనవంతు కృషి చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కీసర మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సుమతి,గోధుమకుంట మాజీ వార్డ్ మెంబర్ చీర శేఖర్,కందాడి శ్రీనివాస్ రెడ్డి, చీర శ్రీశైలం,కాలనీ అధ్యక్షులు నాగభూషణం, కోశాధికారి రాహుల్,ప్రసాద్,రాజేష్, అనిల్,కాలనీ అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## సొంతింటి కలను సాకారం చేస్తాం

### - మాజీ సర్పంచ్ కడమోని శ్రీశైలం

**ఆమనగల్లు, నవంబర్ 04 (అక్షర గళం):**
అర్హులైన ప్రతి ఒక్కరికి రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇంటిని నిర్మించి సొంతింటి కలను సాకారం చేస్తుందని మాజీ సర్పంచ్ కడమోని శ్రీశైలం అన్నారు. మంగళవారం తలకొండపల్లి మండల పరిధిలోని దేవుని పడకల్ గ్రామంలో ఇందిరమ్మ పథకం కింద ఇళ్లు మంజూరై నిర్మించుకుంటున్న లబ్ధిదారుల ఇంటిని మాజీ సర్పంచ్ కడమోని శ్రీశైలం



పరిశీలించి మాట్లాడారు.. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వమంటేనే రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అభివృద్ధిని కాంక్షించే పార్టీ అన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలుపు రేషన్ కార్డులు ఉన్న ప్రతి ఒక్కరికీ కడుపు నిండా భోజనం చేయాలన్న సంకల్పంతో సన్నబియ్యం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

## మెడికల్ షాపులపై డ్రగ్ అధికారుల దాడులు

**ఆమనగల్లు, నవంబర్ 04 (అక్షర గళం):**
ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడుగుల మందుల దుకాణాలపై మంగళవారం ఈ ఔషధ నియంత్రణ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఔషధ నియంత్రణ జిల్లా అధికారి ప్రసాద్ మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న అన్ని దుకాణాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అన్ని దుకాణాల



నిర్వాహకులు విధిగా వినియోగదారులకు బిల్లులను ఇవ్వాలని, కాలం చెల్లిన మందులు లేకుండా జాగ్రత్త పడాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న 12 దుకాణాలను గుర్తించినట్లు తెలిపారు. వారందరికీ నోటీసులు జారీ చేశామన్నారు. తనిఖీల్లో మహేశ్వరం జోన్ డ్రగ్ ఇన్స్పెక్టర్ స్రవంతి రెడ్డి, సహా డ్రగ్స్ ఇన్స్పెక్టర్ అన్వేష్, శ్వేత బిందు, శైలజ, రష్మి, నాగరాజు తదితరులు ఉన్నారు.





## వ్యాపార అభివృద్ధి ద్వారా సమాజానికి మేలు చేయాలి

### మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా



**మేడ్చల్ ప్రతినిధి,నవంబర్ 04, (అక్షర గళం):** వ్యాపార అభివృద్ధి ద్వారా సమాజానికి మేలు చేయాలని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా సూచించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం , బిట్స్ పిలాని సంయుక్తంగా ప్రగతి (ప్రోగ్రామ్ ఫర్ రూరల్ అడ్వాన్స్మెంట్ గ్రోత్ అండ్ ట్రాన్స్ఫర్మేషన్ త్రూ ఇన్నోవేషన్ సెంటర్) ఆధ్వర్యంలో మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లాలోని 50 మంది ఔత్సాహిక మహిళలకు ఒకరోజు ఓరియెంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా , బిట్స్ పిలాని డీన్ యోగీశ్వరి లు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళల కోసం ఏర్పాటు చేయబడిన ఈ శిక్షణ కార్యక్రమంలో, ప్రస్తుత సమాజంలో మహిళలు వ్యాపార అభివృద్ధిలో ఎదుర్కొంటున్న సవాళ్లు, వాటిని అధిగమించే మార్గాలు, బ్యాంకుల ద్వారా రుణాలు పొందే విధానం, పొందిన రుణాలను సద్వినియోగం చేసుకుంటూ విజయవంతమైన పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి అవసరమైన మెలకువలు వివరించారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా లోని మహిళలందరూ మంచి పారిశ్రామికవేత్తలుగా ఎదగాలన్నారు. మహిళలు నిర్వహించే వ్యాపారానికి ఒక ప్రత్యేక బ్రాండింగ్ ఉండాలన్నారు. ఆ ఉత్పత్తులు మంచి నాణ్యతతో ఉండాలని ఉద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో నేర్చుకున్న విషయాలను జిల్లాలోని ఇతర మహిళలతో పంచుకొని వారికి కూడా మెలకువలు తెలియజేయాలని ఆమె కోరారు.ఈ కార్యక్రమంలో డి.ఆర్.డి.ఓ సాంబశివరావు, బిట్స్ డీన్ యోగేశ్వరి, డైరెక్టర్ సౌమ్య ముఖర్జీ, హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్ ఋషి కుమార్, ప్రొఫెసర్ సెంటర్ హెడ్ స్వాతి అలోక్, రిసోర్స్ పర్సన్ మహేష్ విశ్వనాథ్ (జనరల్ మేనేజర్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, లెర్నింగ్ అండ్ డెవలప్మెంట్ డిపార్ట్మెంట్), ఎస్.బి.ఐ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్, డాక్టర్ వసుమతి (అసిస్టెంట్ ప్రొఫెసర్), ఎస్.బి.ఐ సుబ్రహ్మణ్యం, డిపార్ట్మెంట్ ఆఫ్ ఎకనామిక్స్ పూర్వ ఆర్.బి.ఐ ఆంధ్ర బ్యాంక్ నుండి నిపుణులు శిక్షణ అందించారు.





## ఉప ఎన్నిక తర్వాత బీఆర్ఎస్ భూస్థాపితం

### - తెలంగాణ ఇన్చార్జి మీనాక్షి నటరాజన్

**ఆమనగల్లు, నవంబర్ 04 (అక్షర గళం):**
జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక తర్వాత బీఆర్ఎస్ భూస్థాపితం అవుతుందని ఏఐసీసీ తెలంగాణ ఇన్చార్జి మీనాక్షి నటరాజన్ జోస్యం చెప్పారు. మంగళవారం యూసుఫ్ గూడా డివిజన్లోని వెంకటగిరిలో మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డి, టీపీసీసీ సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్, పొల్యూషన్ బోర్డ్ మెంబర్ ఠాకూర్ బాలాజీ సింగ్ లతో కలిసి ఎన్నికల ప్రచారంలో ఆమె పాల్గొని మాట్లాడారు.. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ అన్ని వర్గాల ప్రజల కోసం పని చేసిందని గుర్తు చేశారు. బీఆర్ఎస్ పార్టీ పదేళ్లు రాష్ట్రాన్ని పాలించి నాటి సీఎం కేసీఆర్ కుటుంబం, ఆయన మంత్రులు రాష్ట్రాన్ని యథేచ్ఛగా దోచుకున్నారన్నారు.

మరోవైపు బీజేపీ కుల ప్రాతిపదికపైన పరిపాలించే పార్టీ అని ఆయన అన్నారు. తెలంగాణలో సీఎం రేవంత్ రెడ్డి రెండేళ్ల పాలనలో రాష్ట్రం ఎంతగానో అభివృద్ధి చెందిం దన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రయత్నాల కారణంగా హైదరాబాద్ తో పాటు తెలంగాణ రాష్ట్రంలో విదేశీ పెట్టుబడులు వచ్చాయన్నారు. కాంగ్రెస్తోనే అన్ని వర్గాల ప్రజలకు సమ న్యాయం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీదే అంతిమ విజయమని, విపక్షాలను ప్రజలు విశ్వసించడం లేదన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు మండ్లి రాములు, మాజీ వైస్ ఛైర్మన్ గుర్రం కేశవులు, జిల్లా నాయకులు కృష్ణ నాయక్, ఐఎన్టియుసి జిల్లా అధ్యక్షుడు ఎంగలి ప్రసాద్, మాజీ సర్పంచ్లు ఎగిరిశెట్టి గోదాదేవి సత్యం, కడమోని శ్రీశైలం, డైరెక్టర్ చేగురి వెంకటేష్, వెంకట్ రెడ్డి, అంజన్ రెడ్డి, మహేందర్ గౌడ్, పర్వతాలు, శ్రీను నాయక్, గాజుల రమేష్, కాలే మల్లయ్య, విజయ్ నాయక్, హరిలాల్, పులికంటి మైసయ్య, రామక్రిష్ణ, పత్య నాయక్, జైపాల్, బద్ది వెంకటేష్, రాజ్యా నాయక్, పత్య తదితరులు పాల్గొన్నారు.







## దేశవ్యాప్తంగా 116గురు ఉపాధ్యాయులకు జాతీయ ఉపాధ్యాయ అవార్డు-2025

### డాక్టర్ రాధాకృష్ణన్ టీచర్స్ సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ ఆధ్వర్యంలో ఘన సత్కారం

**కీసర,నవంబర్ 04 (అక్షర గళం):** విద్యా రంగంలో అత్యుత్తమ సేవలు అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్న దేశవ్యాప్తంగా 116 మంది ఉపాధ్యాయులను "జాతీయ ఉపాధ్యాయ అవార్డు–2025"తో ఘనంగా సత్కరించారు. డాక్టర్ రాధాకృష్ణన్ టీచర్స్ సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ నిర్వహించిన ఈ అవార్డు కార్యక్రమం ఆదివారం సికింద్రాబాద్లోని సెంట్రల్ హిందీ టీచింగ్ ఇన్స్టిట్యూట్ లో జరిగింది. ఉదయం 10:00 గంటల నుంచి మధ్యాహ్నం 3:40 గంటల వరకు జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు విద్యావేత్తలు, అకాడెమిక్ నిపుణులు, రాష్ట్ర మరియు జాతీయ స్థాయి ప్రతినిధులు పాల్గొన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల వ్యక్తిత్వ వికాసం, నైతిక విలువలు, ఆధునిక బోధన విధానాలు మరియు సాంకేతిక వినియోగంపై చూపిన అంకితభావం పరిగణనలోకి తీసుకొని అవార్డులు అందజేశారు. అవార్డులను ప్రకటిస్తూ, డాక్టర్ రాధాకృష్ణన్ టీచర్స్ ఎస్హెచ్జీ అధ్యక్షుడు డాక్టర్ అజిత్ కుమార్ చౌహాన్ మాట్లాడుతూ,"ఉపాధ్యాయులు దేశ భవిష్యత్ శిల్పులు. నాణ్యమైన విద్య అందించడంలో, కొత్త ఆవిష్కరణలతో బోధన విధానాలను అభివృద్ధి చేయడంలో, సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్న ఉపాధ్యాయులకు ఈ అవార్డు అంకితం. విద్యారంగానికి సేవ చేయడం ఒక పవిత్ర కర్తవ్యం", అని అన్నారు.ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ బబితా చక్కిలం,రాష్ట్ర సమన్వయకర్త లందరినీ ప్రత్యేకంగా సత్కరించారు. కార్యక్రమ విజయవంతం కోసం వారు సమర్పణతో పనిచేసినట్లు డాక్టర్ చౌహాన్ అభినం దించారు. "సమయం, శ్రమ, మనసు, మద్దతుప్రతి రంగంలో అంకిత భావంతో పనిచేసిన మీ సేవ ప్రశంసనీయమైనది," అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ప్రసంగాలు, గౌరవ కార్యక్రమాలు, ఉపాధ్యాయుల అనుభవ పంచుకోలు నిర్వహించారు.

## కాంగ్రెస్ నాయకుల విస్తృత ప్రచారం



**ఆమనగల్లు, నవంబర్ 04 (అక్షర గళం):**
జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు కోసం కడ్తాల్ మండల కాంగ్రెస్ నాయకులు విస్తృత ప్రచారం చేపట్టారు. మంగళవారం యూసుఫ్ గూడా లోని పలు కాలనీలలో యువ నాయకులు అద్దాల మహేందర్ గౌడ్ ఇంటింటి ప్రచారం నిర్వహించి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి ఓటు వేయాల్సిందిగా కోరారు. కాంగ్రెస్ కు ఓటు వేసి అభివృద్ధిని మరింత పటిష్టం చేయాలన్నారు. అన్ని వర్గాల సంక్షేమం కాంగ్రెస్ పార్టీకే సాధ్యమవుతుందన్నారు. నవీన్ యాదవ్ సేవా దృక్పథంతో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఎవరికి ఏ ఆపద ఉన్నా అన్ని వేళలా ఆదుకుంటూ ఉంటున్న వ్యక్తిగా గుర్తింపు పొందారని, కాంగ్రెస్ హస్తం గుర్తుకు ఓటువేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో రామకృష్ణ, ఆలంపల్లి యాదయ్య తదితరులు ఉన్నారు.

## నవీన్ గెలుపును ఎవరూ ఆపలేరు

**- మండ్లి రాములు**

**ఆమనగల్లు, నవంబర్ 04 (అక్షర గళం):** కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపును ఎవరూ ఆపలేరని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మండ్లి రాములు స్పష్టం చేశారు. యూసుఫ్ గూడా డివిజన్ పరిధిలోని వెంకటగిరి కాలనీలో మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించి కాంగ్రెస్



ఆరు గ్యారంటీల గురించి ప్రజలకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..రేవంత్ రెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజల సంతోషంగా ఉన్నారని, ప్రతి పక్ష పార్టీలకు గత ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పినా తిరిగి వారు మాయమాటలతో జూబ్లీహిల్స్ లో ఓట్లు అడుతున్నారని అన్నారు. బీఆర్ఎస్ కాలం చెల్లిన పార్టీ అని, ఆ పార్టీ నాయకులు చెప్పే మోసపూరిత వాగ్దానాలు ఇక్కడి ఓటర్లు నమ్మే స్థితిలో లేరని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో విజయ్ నాయక్, హరిలాల్, పత్య నాయక్, శ్రీను నాయక్, వెంకటేష్, రామక్రిష్ణ, పత్య, జైపాల్ నాయక్, రాజ్య నాయక్ తదితరులు ఉన్నారు.



## రాజీ కేసులను పరిష్కరించుకోవాలి

**- జూనియర్ సివిల్ జడ్జి కాటం స్వరూప**

**ఆమనగల్లు, నవంబర్ 04 (అక్షర గళం):** ఈనెల 15న నిర్వహించనున్న స్పెషల్ లోక్ అదాలత్‌లో రాజీపడ తగిన కేసులను పరిష్కరించుకోవాలని ఆమనగల్లు జూనియర్ సివిల్ జడ్జి కాటం స్వరూప అన్నారు. మంగళవారం పట్టణ కేంద్రంలోని కోర్టు ఆవరణలో పోలీస్ అధికారులతో సమావేశాలు ఏర్పాటు చేసి మాట్లాడారు.. పెండింగ్ కేసుల భారాన్ని తగ్గించడానికి అధిక సంఖ్యలో కేసులు రాజీ అయ్యే విధంగా న్యాయవాదులు, పోలీస్ అధికారులు పరస్పర సమన్వయంతో, సమష్టి కృషితో పని చేయాలని సూచించారు. ముఖ్యంగా ప్రామిసరీ నోట్లకు సంబంధించిన దావాలు, చెక్ బౌన్స్ కేసులు, కుటుంబ వివాదాల కేసులు, దాంపత్య జీవితాల కేసులు పరిష్కారం - అయ్యేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో సీఐలు జానకి రామ్ రెడ్డి, గంగాధర్, ఎస్ఐలు వెంకటేష్, శ్రీకాంత్, రాఘవేందర్ మరియు కోర్టు కానిస్టేబుల్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

**- ఎంపీడీఓ కుసుమ మాధురి**

**ఆమనగల్లు, నవంబర్ 04 (అక్షర గళం):** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఎంపీడీఓ కుసుమ మాధురి అన్నారు. మంగళవారం ఆమనగల్లు మండల పరిధిలోని సింగంపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించి ఆమె మాట్లాడుతూ.. లబ్ధిదారులు ఇండ్ల నిర్మాణ పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. నిర్మాణ పనులు పూర్తయిన వారికి బిల్లులు వెంటనే చెల్లించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనులు ఇంకా ప్రారంభించని లబ్ధిదారులకు పంచాయతీ అధికారులు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. అదేవిధంగా గ్రామపంచాయతీ స్పెషల్ ఆఫీసర్ అభిషేక్‌తో కలిసి ఉపాధి హామీ పథకంలో పనుల గుర్తింపు, క్రెడిట్స్, లింక్ రోడ్లు, ఇంకుడు గుంతలు, అండర్ డ్రైనేజీ తదితర అంశాలపై గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో కార్యదర్శి లక్ష్మణ్, టీఏ జయమ్మ, ఎఫ్ఏ వినోద్ రెడ్డి, నాయకులు వెంకటేష్, గ్రామస్తులు రైతులు, ఇందిరమ్మ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదం దురదృష్టకరం

**- కావలి శ్రీశైలం**

**ఆమనగల్లు, నవంబర్ 04 (అక్షర గళం):** రోడ్డు ప్రమాదంలో 21 మంది ప్రయాణికులు ప్రాణాలను కోల్పోవడం దురదృష్టకరమని ఎమ్మార్పీఎస్ ఆమనగల్లు మండల అధ్యక్షుడు కావలి శ్రీశైలం ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ... చేవెళ్ల సమీపాన జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం సంఘటన జరిగి 21 మంది ప్రాణాలు కోల్పోవడం బాధాకరమ న్నారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సంతాపం తెలియ జేస్తూ వారి ఆత్మకు శాంతి చేకూ రాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నా నన్నారు. ప్రభుత్వం వెంటనే విచారణ ప్రారంభించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు చేపట్టాలన్నారు.







## పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

**వెల్దండ, నవంబర్ 04 (అక్షర గళం):** వెల్దండ మండల పరిధిలోని చొక్కన్నపల్లి గుండాల గ్రామాలలో పశువులకు ఉచిత గాలి కుంట వ్యాధి నివారిణి టీకాలు వేశారు రాష్ట్రస్థాయి పర్యవేక్షకులు డాక్టర్ వెంకటయ్య గౌడ్ జిల్లా పశువైద్య అధికారి డాక్టర్ జ్ఞాన శేఖర్ విజయ డైరీ డిప్యూటీ డైరెక్టర్ సత్యనారాయణ యాదవ్‌లు ముఖ్య అతిథులుగా హాజరై క్షేత్ర స్థాయిలో సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించి వ్యాధి బారిన పడకుండా చూసుకోవాలని రైతులకు సూచిం చారు. కావున రైతులందరూ పశువులకు టీకాలు తప్పక వేయించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వెల్దండ పశువైద్య అధికారి డాక్టర్ శ్యాంసుందర్ పశు వైద్య సిబ్బంది నరేష్ రెడ్డి నరసింహ ఫణిందర్ రెడ్డి శ్రీను తిరుపతయ్య గోపాలమిత్రలు బాలు మొగులయ్య సాయిబాబు బిఎంసియు సూపర్వైజర్ కృష్ణ రైతులు కుడుముల శశిధర్ రెడ్డి ఈదులపల్లి రామకృష్ణ సుమంత్ రెడ్డి ఈదులపల్లి పెద్దయ్య బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.



## పిడుగు పడి మూడు ఆవులు మృతి

**వెల్దండ, నవంబర్ 04 (అక్షర గళం):** వెల్దండ మండల పరిధిలోని తిమ్మినోనిపల్లి గ్రామానికి చెందిన గుమ్మకొండ లింగమయ్య కు చెందిన మూడు పాడి ఆవులు మృతి చెందినట్లు బాధితులు తెలిపిన వివరాల ప్రకారం సోమవారం సాయంత్రం తన పశువులను షెడ్డులో ఆవులను కట్టేసి ఇంటికి వచ్చి రైతు లింగమయ్య మంగళవారం తెల్ల వారుజామున ఆవులకు పాలు పిండడానికి వెళ్లి చూడగా మూడు ఆవులు విగత జీవిగా పడి ఉండడం చూసి రైతు కన్నీరు మునీరుతో బోరున విలపించాడు సోమవారం రాత్రి కురిసిన వర్షానికి పిడుగు పాటుతో మృతి చెందినట్లు రైతు గుమ్మకొండ లింగమయ్య అన్నారు మృతి చెందిన మూడు ఆవుల విలువ రెండు లక్షల 20000 వేల రూపాయలు ఉంటుందని రైతు అన్నారు ప్రభుత్వ తరపున తమను ఆదుకోవాలని రైతు గుమ్మకొండ లింగమయ్య కోరారు.







## రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

**తహసిల్దార్ కార్తీక్ కుమార్‌కి వినతిపత్రం అందజేసిన బిజెపి పార్టీ మండల అధ్యక్షులు కురుమిద్ద యాదగిరి**

**వెల్దండ, నవంబర్ 04 (అక్షర గళం):** భారీ వర్షాలతో నష్టపోయిన పంట రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని వెల్దండ మండల బీజేపి పార్టీ నాయకులు తహసిల్దార్ కార్తీక్ కుమార్ కి వినతి పత్రం అందజేశారు ఈ సందర్భంగా బిజెపి పార్టీ మండల అధ్యక్షుడు కురుమిద్ద యాదగిరి మాట్లాడుతూ రాష్ట్రంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వరి, మొక్కజొన్న, పత్తి పంటలు నష్టపోయి రైతాంగం తీవ్రంగా నష్టపోయింది. తడిసిన ప్రతీ రైతు ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. పంట



నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. 30 వేల రూపాయల నష్టపరిహారం చెల్లించాలని కోరారు. అదేవిధంగా వర్షానికి ఇల్లు కూలిపోయిన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వెల్దండ మండల బీజేపి పార్టీ జనరల్ సెక్రెటరీ రవి మట్ట విష్ణు గౌడ్ సింగిల్ విండో మాజీ చైర్మన్ మోహన్ రెడ్డి, సీనియర్ నాయకులు జూలూరు బాలస్వామి, పబ్బు చక్రవర్తి గౌడ్, శ్రీశైలం, వెంకటేష్, కొండల్, పెద్దయ్య, శ్రీకాంత్, జెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలలో కారు గుర్తుకు భారీ మెజార్టీతో విజయం సాధించాలి

**బీఆర్ఎస్ పార్టీ శేరిలింగంపల్లి రాష్ట్ర నాయకుడు మరబోయిన రవి యాదవ్**

**జూబ్లీహిల్స్, నవంబర్ 04, (అక్షర గళం):** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలలో కారు గుర్తుకు భారీ మెజార్టీతో విజయం సాధించాలని బీఆర్ఎస్ పార్టీ శేరిలింగంపల్లి రాష్ట్ర నాయకుడు మరబోయిన రవి యాదవ్ అన్నారు. మంగళవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ పార్టీ శేరిలింగంపల్లి రాష్ట్ర నాయకుడు మరబోయిన రవి యాదవ్, ఎర్రగడ్డ డివిజన్ సుల్తాన్‌నగర్ ప్రాంతంలో ఇంటింటికీ తిరిగి పాదయాత్ర నిర్వహించారు. ఎర్రగడ్డ డివిజన్ ఇన్‌ఛార్జ్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదేశాల మేరకు, ప్రజలకు కారు గుర్తుకే ఓటు వేయాలని విజ్ఞప్తి చేస్తూ బీఆర్ఎస్ అభ్యర్థి విజయం కోసం రవి యాదవ్ విస్తృతంగా ప్రచారం చేపట్టారు.ప్రజల నుంచి ఈ ప్రచారానికి విశేష




స్పందన లభించింది. సుల్తాన్‌నగర్ వీధులు "కారు గుర్తుకు ఓటు– అభివృద్ధికి ఓటు" నినాదాలతో మార్మోగాయి. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, రాజు, అలీ, శ్రీకాంత్ యాదవ్, స్వామి ముదిరాజ్, శ్రీశైలం యాదవ్, ఫిరోజ్, ఇతరులు పాల్గొన్నారు.





## ఆపదలో ఉన్నవారికి అండగా సీఎం సహాయనిధి

**కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కేశ మల్ల కృష్ణ**

**వెల్దండ నవంబర్ 04 (అక్షర గళం):** ఆపదలో ఉన్నవారికి సీఎం రిలీఫ్ ఫండ్ అండగా ఉంటుందని కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కేశ మల్ల కృష్ణ అన్నారు వెల్దండ మండల పరిధిలోని పెద్దాపూర్ గ్రామ పంచాయతీ తునికిబండ తండాకి చెందిన మూడవత్ కేశ్య అనారోగ్యంతో హైదరాబాదులోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా ఎమ్మెల్యే కాశిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన 21 వేల రూపాయలు చెక్కును బాధితునికి కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కేశ మల్ల కృష్ణ అందజేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్య కోసం అత్యవసర పరిస్థితులలో చికిత్స పొందుతున్న వారికి ఈ నిధి భరోసాగా నిలుస్తుంది అన్నారు.

ఈ కార్యక్రమంలో లక్ష్మారెడ్డి, నెంట శ్రీను శివ ధనుష్ మాద్గుల వెంకటయ్య, మోత్య నాయక్, శివరాం నాయక్,సుధాకర్, తిరుపతి నాయక్,అనిల్, రాజేష్ నాయక్, ప్రవీణ్ నాయక్, ప్రశాంత్, సంతోష్ నాయక్, ఉదయ్ నాయక్, వినోద్ జగన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావును పరామర్శించిన శంబీపూర్ కృష్ణ

**కుత్బుల్లాపూర్,నవంబర్ 04, (అక్షర గళం):** ఇటీవల మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు తండ్రి తన్నీరు సత్యనారాయణ అనారోగ్యంతో మృతి చెందారు.

ఈ సందర్భంగా కోకాపేట్‌లోని క్రిన్స్ విల్లాస్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు శంభీపూర్ క్రిష్ణ పాల్గొని తన్నీరు సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మాజీ మంత్రి హరీష్ రావుని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ కౌన్సిలర్లు మహేందర్ యాదవ్, కుంటి నాగరాజు, సుధాకర్



రెడ్డి, పాక్స్ డైరెక్టర్ జీతయ్య బీఆర్ఎస్ మునిసిపల్ జనరల్ సెక్రటరీ కొల్తూర్ మల్లేష్ ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

# ఉప ఎన్నిక ఫలితంపై ప్రభావం ఓటుకునోటు తీర్పు

- స్మార్ట్ సిటీ మిషన్ కింద కేంద్ర నిధులతోనే ఇక్కడ సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు
- మాజీ ఎంపి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా.బూర నర్సయ్య గౌడ్ జోస్యం


హైదరాబాద్,(అక్షర గళం):

జూబ్లీహిల్స్ ఉపఎన్నికల ఫలితం రాజకీయ పరంగా కీలకం అవుతుందని మాజీ ఎంపి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా. బూర నర్సయ్య గౌడ్ వ్యాఖ్యానించారు. సుప్రీం కోర్టులో కొనసాగుతున్న "ఓటుకు నోటు" కేసులో పరిణామాలు, ఈ ఉపఎన్నిక ఫలితంపై ఆధారపడి రాజకీయ ప్రభావం చూపవచ్చని ఆయన జోస్యం చెప్పారు. ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సన్నిహితుల్లో కొందరు ఆయన నాయకత్వంపై అసంతృప్తిని వ్యక్తం చేస్తూ స్టేట్‌మెంట్లు ఇవ్వడం ప్రారంభించారని వెల్లడించారు. ఢిల్లీలో కూడా ఈ అంశంపై అంతర్గత చర్చలు జరుగుతున్నాయని పేర్కొన్నారు.

జూబ్లీహిల్స్ వంటి ప్రతిష్టాత్మక నియోజకవర్గంలో కూడా అభి వృద్ధి జరగకపోవడం, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తీవ్రంగా ఉండటం.. బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనల అసలైన ప్రతిఫలమేనని డా.బూర నర్సయ్య గౌడ్ విమర్శించారు.

ఇంత ముఖ్యమైన ప్రాంతంలో ఇలాంటి దుస్థితి ఉంటే, రాష్ట్రం లోని మిగతా ప్రాంతాల పరిస్థితి ఊహించుకోండని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు ప్రజల సమస్యలపై దృష్టి పెట్టకుండా, రాజకీయ ప్రలోభాలు, మాయమాటలతోనే వ్యవహరిస్తున్నారని విమర్శించారు. "ప్రజల సమస్యలు పక్కనపెట్టి, రియల్ ఎస్టేట్ లాభాలు, కాంట్రాక్టులు, రాజకీయ బేరసారాలు మాత్రమే ప్రభుత్వ ప్రాధాన్యం అయిపోయాయని ఆయన అన్నారు.

తమ పార్టీకి ఓటు వేయకపోతే ప్రభుత్వ పథకాలు ఆపేస్తామని చెప్పడం ప్రజాస్వామ్యానికి అవమానమన్నారు. ఇలాంటి వ్యాఖ్యలపై ఎన్నికల సంఘం కఠినంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండూ ఒకే నాణానికి రెండు వైపులని... ప్రజలు ఈసారి జూబ్లీహిల్స్ అధికారిక నియామకాలు, కాంగ్రెస్ మద్దతుదారుల ఆధిపత్యం ప్రజల నమ్మకాన్ని దెబ్బతీసిందని విమర్శించారు.




బైఎలక్షన్‌లో బీజేపీకి మద్దతు ఇచ్చి, కాంగ్రెస్–బీఆర్ఎస్ పార్టీలకు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో చేసిన హామీలను ప్రజలు ఇప్పుడు తీవ్రంగా ప్రశ్నిస్తున్నారని నర్సయ్య గౌడ్ తెలిపారు. ముఖ్యంగా వృద్ధులకు రూ. 4,000 పెన్షన్, ప్రతి మహిళకు రూ.2,500 ఆర్థిక సాయం, రూ.500కి గ్యాస్ సిలిండర్, ప్రతి ఆడబిడ్డకు తులం బంగారం, డిగ్రీ విద్యార్థినులకు స్కూటర్లు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. అలాగే, రాష్ట్రంలో ఏర్పాటైన రాజకీయ వ్యవస్థలు,

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన 'మోదీ, కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఏమి తెచ్చారన్న వ్యాఖ్యకు సమాధానంగా "ఉచిత రేషన్, ప్రతి ఇంటికి విద్యుత్, గ్యాస్ కనెక్షన్, తాగునీరు – ఇవన్నీ కేంద్ర పథకాల ఫలితమే. విశ్వకర్మ యోజన కింద వేలకు వేలు కుటుం బాలు లబ్ధి పొందాయి. ఇవన్నీ మోదీ పాలనలోనే సాధ్యమయ్యాయని స్పష్టం చేశారు.

"స్మార్ట్ సిటీ మిషన్ కింద కేంద్ర నిధులతోనే ఇక్కడ సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు జరుగుతున్నాయి. స్వచ్ఛ భారత్ పథకం కింద ప్రతి ఇంటికి మరుగుదొడ్ల నిర్మాణం కూడా కేంద్ర నిధులతోనే జరిగాయి. రాష్ట్ర ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టలేదని తెలిపారు. జూబ్లీహిల్స్‌లో చిన్న వ్యాపారులు, వీధి వ్యాపారులు, మహిళా సంఘాలకు స్వనిధి, ముద్ర రుణాలు, స్టాండ్‌అప్ యోజనల కింద ఆర్థిక సహాయం అందిందని చెప్పారు.

"తెలంగాణలో 46 లక్షల మందికి ఈ పథకాల లబ్ధి కలిగింది. జూబ్లీహిల్స్‌లో వేలాది కుటుంబాలు వాటి లబ్ధిదారులుగా ఉన్నారని స్పష్టంగావివరించారు. మరోవైపు "హైదరాబాద్‌లో నేషనల్ హైవేల దగ్గర రోడ్లు కొంత బాగున్నాయంటే, అది మోదీ గారి 'గతిశక్తి' యోజన వల్లేనని కాని గుంతలు పూడ్చేందుకు కూడా బడ్జెట్ కేటాయించిన ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని ఎద్దేవా చేశారు.



## మంచి మెజార్టీతో జూబ్లీహిల్స్ గెలవబోతున్నాం

- మంత్రి పొంగులేటి సమక్షంలో భారీ ఎత్తున కాంగ్రెస్‌లో చేరికలు

హైదరాబాద్,(అక్షర గళం):

మంచి మెజార్టీతో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించబోతుందని రాష్ట్ర రెవెన్యూ ,హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి, రెహమత్ నగర్ డివిజన్ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం రెహ్మత్‌నగర్ డివిజన్‌లోని ఓమ్ నగర్ చర్చి కమిటీ సభ్యులు, వివిధ పార్టీల నాయకులు మంగళవారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమక్షంలో రోడ్ సేఫ్టీ అథారిటీ ఛైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి కాంగ్రెస్ కండువాలు కప్పి మంత్రిగారు స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో గడచిన 23 నెలల్లో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే కాంగ్రెస్ పార్టీకి విజయాన్ని చేకూర్చిపెడతాయని ధీమా వ్యక్తం చేశారు. ఈ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మంచి మెజార్టీతో విజయం తథ్యమని అన్నారు. ఇప్పటికే ఈ డివిజన్‌లో పెద్ద ఎత్తున వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు, నాయకులు, ఆటో యూనియన్ సభ్యులు కాంగ్రెస్ పార్టీలో చేరారని అన్నారు. త్వరలో మరికొంతమంది కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారని అన్నారు.

పదేళ్లలో జూబ్లీ హిల్స్ నియోజకవర్గంలో ఒక్క రేషన్ కార్డుకూడా ఇవ్వలేని బి ఆర్ ఎస్ పార్టీ నాయకులకు ఓట్లు అడిగే హక్కు ఎక్కడిదని ప్రశ్నించారు. 22 నెలల్లోనే జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో అర్హులైన 14వేల కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులు ఇచ్చామని, అలాగే సుమారు 8వేల మంది పేర్లను కార్డులలో చేర్పించామని అన్నారు.



## బీజేపీ బీఆర్ఎస్‌తో లోపాయికారి ఒప్పందం

- బీజేపీ అభ్యర్థిని కేసీఆర్‌కి అప్పగించారు
- బీజేపీకి ఓటు వేసిన బీఆర్ఎస్‌కి వేసినట్టే
- మంత్రి పొన్నం ప్రభాకర్
- జూబ్లీహిల్స్ మహమూద్ ఫంక్షన్ హాల్‌లో యూసుఫ్ గూడా డివిజన్ మైనార్టీ నేతలతో మంత్రులు పొన్నం ప్రభాకర్,ఉత్తమ్ కుమార్ రెడ్డి, అజారుద్దీన్ సమావేశం
- సమావేశంలో పాల్గొన్న ఏఐసిసి సెక్రెటరీ విశ్వనాథ్ , సంపత్ కుమార్, ఎంపీ కడియం కావ్య , ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణ రెడ్డి, బత్తుల లక్ష్మారెడ్డి, జయవీర్ రెడ్డి, శివసేన రెడ్డి, నిర్మలా జగ్గారెడ్డి , నూతి శ్రీకాంత్ గౌడ్ వెలిచాల రాజేందర్ రావు

హైదరాబాద్,(అక్షర గళం):

జూబ్లీహిల్స్ ప్రజలకు మంచి అవకాశం వచ్చింది. బీజేపీ, బీఆర్ఎస్ ఈ ఉప ఎన్నికల్లో కుమ్మక్కై పని చేస్తున్నాయి. రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా పాలన ప్రభుత్వం లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు సంక్షేమ పథకాలు అందిస్తున్నాం.10 సంవత్సరాలుగా రేషన్ కార్డులు ఇవ్వలేదు. అప్లై చేసుకున్న అర్హతగా ఉన్న ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు అందిస్తున్నాం.

గత ప్రభుత్వం దొడ్డు బియ్యం ఇస్తే ఎవరు తినే పరిస్థితి లేకుండే. మేము సన్న బియ్యం పంపిణీ చేస్తున్నాం. పేదలు కరెంట్ బిల్లు కట్టాలన్న ఇబ్బందులు పడేది. మా ప్రభుత్వంలో 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. మైనార్టీల కోసం మన ప్రభుత్వం ఎన్నో పథకాలు రూపొందించింది. ఉపాధి కల్పనకు ప్రత్యేక పథకాలు తీసుకొచ్చింది. ఇటీవలే మన అజారుద్దీన్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. బీజేపీ బీఆర్ఎస్‌తో లోపాయికారి ఒప్పందం చేసుకున్నారు.బీజేపీ అభ్యర్థిని కేసీఆర్‌కి అప్పగించారు. బీజేపీకి ఓటు వేసిన బీఆర్ఎస్ కీ వేసినట్టే. బీఆర్ఎస్‌కు ఓటేసిన బీజేపీ కి వేసినట్టే. గత ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థికి 25 వేల ఓట్లు వచ్చాయి. ఈసారి అంతకన్నా తక్కువే వస్తాయి.కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ స్థానికుడు విద్యావంతుడు నిత్యం ప్రజల్లో ఉండే వ్యక్తి నవీన్ యాదవ్ ను భారీ మెజారిటీతో గెలిపించండి. కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీని గెలిపించారు. అక్కడ ఆరు వేల కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. మీరు నవీన్ యాదవ్‌ను గెలిపించుకోండి.

కాంగ్రెస్ ప్రభుత్వం మొత్తం ఆయన వెంట ఉంది. జూబ్లీహిల్స్ అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం. నియోజకవర్గంలో రోడ్లు డ్రైనేజీ పనులు,ఇతర అభివృద్ధి పనులు పూర్తి చేశాం.

## చనాఖా- కొరటా ప్రాజెక్ట్ వ్యయం ఎందుకు పెరిగిందో బీఆర్ఎస్ చెప్పాలి

- 3 వందల కోట్ల అంచనాలు కాస్త 2 వేల కోట్లు అయ్యాయి
- సామాజిక తెలంగాణ సాధన మా లక్ష్యం
- మా అజెండా నచ్చిన వారికి, నచ్చని వారి కూడా స్వాగతం
- భవిష్యత్తులో ఏం జరుగుతుందో ఇప్పుడే చెప్పలేం
- నాలుగు నెలల తర్వాత నిర్ణయం తీసుకుంటాం
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత




ఆదిలాబాద్,(అక్షర గళం):

ప్రజల సమస్యలను మీడియా ద్వారా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి ప్రయత్నిస్తాం. మేము ఎక్కడికి వెళ్లిన సమస్యలు వెల్ కం చేస్తున్నాయి. తెలంగాణలో అన్ని సమస్యలకు రాష్ట్రమొక్కటే పరిష్కారం అనుకున్నాం.

నేను 20 ఏళ్లుగా ప్రజా జీవితంలో ఉన్నాను. ఫీల్డ్‌లో ఎంత పెద్ద ఎత్తున ప్రజలకు వద్దకు వెళ్తే అంత క్లారిటీ వస్తుంది. ఆదిలాబాద్ లో లో పత్తి రైతుల పరిస్థితి చూస్తే చాలా బాధ అనిపించింది. పత్తి సీజన్ ఉందని, అదే విధంగా మొంథా తుపాను ఎఫెక్ట్ ఉందని ప్రజా ప్రతినిధులకు ముందే తెలుసు. ఎంపీ, ఎమ్మెల్యే సహా ఏ నాయకులు కూడా ముందస్తు జాగ్రత్తలు తీసుకోలేదు. జిల్లా కలెక్టర్ అయినా సమస్యను ప్రభుత్వం ముందు ఉంచి ఒత్తిడి పెంచాల్సింది.

జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారం మీద ఉన్న శ్రద్ధ ప్రభుత్వానికి పత్తి రైతుల మీద లేదు. జూబ్లీహిల్స్ లో రైతులు లేరు కనుక వారిని పట్టించుకోవటం లేదు.ఏదైనా రూరల్ ప్రాంతంలో ఉప ఎన్నిక వచ్చి ఉంటే రైతుల అన్ని సమస్యలు తీరేవి. ప్రతిపక్షం మాదిరిగా వాయిస్ మేము వినిపిస్తాం. చిన్న సమస్యలైనా పరిష్కారం అవుతున్నాయి.

సీసీఐ ఛైర్మన్ తో కూడా నేను మాట్లాడతాను. కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ గారితో నాకు పరిచయం ఉంది. వారితో మాట్లాడి పత్తి రైతుకు మేలు చేస్తా. ఆంధ్రా, తెలంగాణలో తుపాను కారణంగా ప్రత్యేక పరిస్థితులు ఉన్నాయి. వీటి గురించి బీజేపీ ఎంపీ కేంద్రంతో మాట్లాడి పత్తి రైతుకు మేలు చేయాలి.

ఆదిలాబాద్ జిల్లాలో చనాఖా– కొరటా, కుప్తి ప్రాజెక్ట్‌లు కావాల్సి ఉన్నాయి. చనాఖా– కొరటా ప్రాజెక్ట్ ది గమ్మతి కథ. 3 వందల కోట్ల అంచనాలు కాస్త 2 వేల కోట్లు అయ్యాయి. ప్రాజెక్ట్ వ్యయం ఎందుకు పెరిగిందో బీఆర్ఎస్ చెప్పాలి? మహారాష్ట్ర లో 1500 ఎకరాల భూ సేకరణ ఇంకా జరగనే లేదు. ప్రాజెక్ట్ నీళ్లు ఓవర్ ఫ్లో అవుతే ఇబ్బంది లేకుండా మహారాష్ట్ర వైపు బండ్ కట్టారు. కానీ మన వైపు బండ్ కట్టలేదు. మన ప్రజా ప్రతినిధులకు ఇంత చిన్న విషయంపై కూడా శ్రద్ధ లేదు. చనాఖా, కొరటా ప్రాజెక్ట్ తక్షణమే పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నా.

బోథ్‌ను రెవెన్యూ డివిజన్ చేసుకునేందుకు జాగృతి శ్రేణులు పోరాటం చేస్తాయి. కుప్తి ప్రాజెక్ట్ లో ఇప్పటి వరకు తట్టెడు మట్టి కూడా తీయలేదు. సిరిచెలిమ వద్ద కూడా ప్రాజెక్ట్ చేపట్టాల్సి ఉంది. బోథ్ లో అన్ని ప్రాజెక్ట్ లను పూర్తి చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతాం. బీజేపీ వాళ్లు ఎన్నికలు వచ్చినప్పుడు రాముడి పేరు చెప్పి ఓట్లు అడుగుతారు. ఎన్నికలు అయిన తర్వాత కూడా దేవుని కోసం పనిచేయాలి. ఎంపీ నిధుల నుంచి నగేష్ అన్న రూ. 20 లక్షలు ఇవ్వాలి. నేను కూడా వీలైనంత సాయం చేస్తాను. వచ్చే ఏడాది నాటికి సమస్య లేకుండా చేసుకుందాం.

ప్రభుత్వం ఫీజు చెల్లించకపోవటంతో ప్రైవేట్ కాలేజ్‌లు బంద్ చేస్తున్నాయి. ఈ పరిస్థితికి కారణమైన ప్రభుత్వం సిగ్గు పడాలి. కాంట్రాక్టర్లకు డబ్బులు ఇస్తారు. కానీ పేద పిల్లలకు చదువు చెప్పే కాలేజ్ యాజమాన్యాలకు ఫీజు రీయింబర్స్ మెంట్ ఇవ్వరా? జాగృతి ని మళ్లీ బలోపేతం చేస్తాం. ప్రజల సమస్యలు తీర్చేందుకు మేమంతా పనిచేస్తాం. భవిష్యత్‌లో ఏం జరుగుతుందో ఇప్పుడే చెప్పలేను. సామాజిక తెలంగాణయే మా లక్ష్యం. మా అజెండా నచ్చిన వారిని, నచ్చని వాళ్లను కూడా వెల్ కం చేస్తున్నాం.



## వచ్చే మండలి సమావేశాలు కొత్త భవనంలోనే

- అసెంబ్లీ భవన నిర్మాణాలు పరిశీలించిన తెలంగాణ శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి

హైదరాబాద్,(అక్షర గళం):

తెలంగాణ శాసన సభ ప్రాంగణములో, తెలంగాణ శాసన మండలి భవనం పునర్నిర్మాణ పనులను తెలంగాణ శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి నేడు పర్యవేక్షించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు అతి త్వరలోనే శాసన మండలి భవన ప్రారంభోత్సవ కార్యక్రమం జరుగనుంది.

తెలంగాణ లేజిస్లేచర్ సెక్రెటరీ డా. నరసింహాచార్యులు, ఆర్ & బి, అగాఖాన్ సంస్థ, మరియు తదితర అధికారులతో శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి జరుగుతున్న పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశంలో శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ "రాబోయే సమా వేశాలు అసెంబ్లీ పక్కనే ఉన్న ఈ భవనంలోనే నిర్వ హించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉందన్నారు.



శాసన మండలి నూతన సమావేశ హాల్ ప్రారంభోత్సవ కార్యక్ర మాన్ని అతి త్వరలోనే నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారని, తాజాగా ఇప్పటి వరకు పూర్తి అయిన పనుల గురించి సీఎం ఆరా తీశారని, ఖచ్చితంగా శాసన మండలి సమావేశాలు పాత భవనం లోనే నిర్వహించాలని వారు ఆదేశించారని తెలిపారు.

పనులలో ఎలాంటి జాప్యం చేయకుండా, వేగం పెంచా లని, త్వరగా భవనాన్ని పూర్తి చేసి శాసన మండలి అధికారులకు అప్పగించాలని తెలంగాణ శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సూచించారు.

## జాతీయ గీతం "వందేమాతరం" 150 సంవత్సరాల వేడుకలు

- దేశవ్యాప్తంగా ఘనంగా నిర్వహణకు కేంద్ర ప్రభుత్వ నిర్ణయం
- రాజ్యసభ సభ్యుడు, బిజెపి ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డా.కె.లక్ష్మణ్

హైదరాబాద్,(అక్షర గళం):

కొత్త పార్లమెంట్ భవనం నిర్మాణం, ఢిల్లీలోని కాలనియల్ పేర్ల మార్పు వంటి నిర్ణయాలు దేశ ఆత్మగౌరవాన్ని ప్రతిబింబించే చర్యలు. ప్రధాని నరేంద్ర మోదీ జాతీయ సమైక్యతకు ప్రతీకగా ఈ మార్పులను తీసుకువస్తుంటే, తమిళనాడులోని ఒక సాంస్కృతిక కేంద్రం ఏర్పాటుపై కూడా కాంగ్రెస్ పార్టీ అభ్యంతరాలు వ్యక్తం చేయడం దురదృష్టకరం.

అలాగే, 2017లో జీహెచ్ఎంసి పరిధిలో పాఠశాలల్లో "వందేమాతరం" గేయం ఆలాపనను తప్పనిసరి చేస్తూ సర్క్యులర్ జారీ చేసినప్పుడు, ఎంఐఎం నాయకుడు అక్బరుద్దీన్ ఓవైసీ దానికి వ్యతిరేకంగా మాట్లాడగా, వెంటనే బీఆర్ఎస్ ప్రభుత్వం వెనక్కి తగ్గింది. అంటే, కేవలం కాంగ్రెస్ మాత్రమే కాదు ం బీఆర్ఎస్ పార్టీ కూడా ముస్లింల ఓట్ల కోసం అదే రకమైన సంతుష్టీకరణ రాజకీయాలు చేసింది. ఈ ధోరణి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కూడా స్పష్టంగా కనిపిస్తోంది.

2019లో మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం మొత్తం సచివాలయంలో "వందేమాతరం" గేయం ఆలాపనపై ఆంక్షలు విధించింది. 1950లో భారత రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ గారు "వందేమాతరం" గీతానికి జాతీయ గీత హోదా ఇచ్చినా, కాంగ్రెస్ పార్టీ దానిని తక్కువ చేయడం జాతీయ గౌరవానికి అవమానకరం.

ఇక ఇప్పుడు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం "వందేమాతరంఏ 150" పేరుతో నవంబర్ 7 నుండి 25 వరకు దేశవ్యాప్తంగా మహోత్సవాలను నిర్వహిస్తున్నది. ఈ కార్యక్రమాల్లో భాగంగా నవంబర్ 7న దేశవ్యాప్తంగా 150 ప్రాముఖ్యమైన



స్థలాల్లో, 150 మంది గాయకుల సమక్షంలో "వందేమాతరం" గేయం ఆలాపన జరగనుంది. ఈ సందర్భంగా వేలాది మంది పాల్గొనేలా వేదికల ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ మహోత్సవాల నిర్వహణలో భాగంగా జార?ండ్, ఒడిశా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు తాను ఇన్‌ఛార్జ్‌గా నియామకవ్వడం ఆనందంగా ఉంది.

భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా వందేమాతరం 150వ వార్షికోత్సవ కార్యక్రమాలు నవంబర్ 8 నుండి 26 వరకు జరగనున్నాయి. నవంబర్ 26న రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఈ ఉత్సవాలు ముగుస్తాయి. ఈ కార్యక్రమాల ద్వారా రాజ్యాంగ విలువలు, దేశభక్తి, జాతీయ సమగ్రత వంటి అంశాలను ప్రజల్లో విస్తృతంగా తీసుకెళ్లడమే పార్టీ లక్ష్యం. ప్రధాని నరేంద్ర మోదీ మార్గదర్శకత్వంలో, ప్రతి పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలోనూ భవ్యమైన కార్యక్రమాలు జరగనున్నాయి.

ప్రతి జిల్లా కేంద్రంలో వందేమాతరం 150వ వార్షికోత్సవానికి గుర్తుగా ప్రత్యేక ప్రదర్శనలు, స్వాతంత్ర్య సమరయోధుల జీవిత విశేషాలు, సెమినార్లు, ఎగ్జిబిషన్లు నిర్వహించబడతాయి. నవంబర్ 7న తెలంగాణలో ఐదు కేంద్రాల్లో ఆదిలాబాద్, నిజామాబాద్, గోల్కొండ, మహబూబ్ నగర్, వరంగల్ జిల్లాల్లో కార్యక్రమాలు ప్రారంభమవుతాయి.

నవంబర్ 8న మొదటి విడతగా 150 ప్రాంతాల్లో 150 మంది గాయకులు పూర్తి వందేమాతరం గేయాన్ని (నాలుగు నిమిషాల నిడివి కలిగిన పూర్తి వెర్షన్) సామూహికంగా ఆలపించనున్నారు. అనంతరం ఈ కార్యక్రమాలు జిల్లాల వారీగా, అసెంబ్లీ స్థాయిలో, స్కూల్లు మరియు కాలేజీలలో కొనసాగుతాయి.

సర్దార్ వల్లభభాయి పటేల్ గారి 150వ జయంతి ఉత్సవాలతో పాటుగా వందేమాతరం 150వ వార్షికోత్సవాన్ని కలిపి, కులమత, భాష, ప్రాంతాల అతీతంగా జాతీయ ఐక్యతను బలపర్చడమే ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశ్యం. ప్రజలు, విద్యార్థులు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని దేశభక్తి ఉత్సాహాన్ని ప్రదర్శించాలని కోరుతున్నాం.

# సంపాదకీయం..

## పాక్‌ను ఎగదోసే పనిలో ట్రంప్!

ట్రంప్‌కు పిచ్చిపట్టిందని ఎవరైనా అనుకుంటే పొరపాటే..ఎందుకంటే ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలు, ఆయన చర్యలు కేవలం భారత్‌ను టార్గెట్ చేస్తున్నవిగా గుర్తించాలి. భారత్ ఆర్థికంగా ఎదగడం ఒక ఎత్తయితే..సైనికపాటవంలో అమెరికాను ధిక్కరించే స్థాయికి చేరుకుంటుందన్న భయం కూడా కనిపిస్తుంది. ముఖ్యంగా ఆపరేషన్ సిందూర్‌లో భారత్ సైనిక పాటవం అజేయంగా నిలిచింది. పాక్‌కు అమెరికా ఇచ్చిన యుద్ధవిమానాలను కూడా తుత్తినియలు చేసింది. ఇదే ప్రధాన కారణంగా ట్రంప్‌ను నిద్రలేకుండా చేస్తోంది. అందుకే ఇటీవల ఆయన తీసుకున్న నిర్ణయాలన్నీ భారత్‌ను ఏకాకిని చేయాలన్న బలమైన సంకల్పంతో తీసుకున్నవేనని గుర్తించాలి. అన్నింటికి మించి పాక్‌ను బూచిగా చూపి బెదిరించాలన్న ధోరణి బాగా కనిపి స్తోంది. ఇందులో భారత్‌తో సమానంగా పాక్‌ను కూడ చేర్చి రెండు అణ్వాయుధ దేశాలు అంటూ పదేపదే వ్యాఖ్యానించారు. ఇప్పుడు పాక్ కూడా అణ్వాయుధ పరీక్షలు చేస్తోందన్నారు. దంతా కూడా పాక్‌తో పావులు వేసి, అక్కడి నుంచి అవసరమైతే భారత్, చైనాలపై దాడులకు దిగాలన్న కుయుక్తులు పన్ను తున్నారు. అందుకే భారత్ వ్యతిరేక చర్యలకు ట్రంప్ స్పీడ్ పెంచారు. సుంకాలు కావచ్చు.. వీసాలు కావచ్చు, అక్కడ అనధికారికంగా ఉన్నవారిని వేధించి, వెళ్లగొట్టి తిప్పిపంపడం కావచ్చు..ఉద్యోగాల్లో భారతీయులను తొలగించాలన్న డిమాండ్ కావచ్చు..ఇవన్నీ కూడా ఆపరేషన్ సిందూర్ తరవాత తీసుకున్న గట్టి నిర్ణయాలు గా చూడాలి. తాజాగా అణ్వాయుధ పరీక్షలు చేస్తామని చెప్పడం ద్వారా పాక్ కూడా అ÷-వాయుధాలు పరీక్షిస్తోందని చెప్పడం కూడా కేవలం భారత్‌ను బెదిరించేదే



చర్య తప్ప మరోటి కాదు. ప్రపంచాన్ని 150 సార్లు నాశనం చేసే అణ్వాయుధాలు అమెరికా వద్ద ఉన్నాయని స్వయంగా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. ఆదివారం నాడు ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇక నుండి అమెరికా అణ్వాయుధాలను పరీక్షిస్తుందని, చాలా దేశాలు అణు పరీక్షలు చేస్తున్నాయని అన్నారు. తమ వద్ద అత్యుత్తమమైన అణ్వాయుధాలున్నాయని, అయినా పెంచుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. అవి ఎలా పని చేస్తున్నాయో పరీక్షించాల్సిన అవసరం ఉందని తెలిపారు. చైనా, రష్యా, ఉత్తర కొరియా దేశాల వద్ద కూడా అణ్వాయుధాలున్నాయని, కాని వారు బయటకు చెప్పరని అన్నారు. గత 30 సంవత్సరాల నుండి ఎటువంటి పరీక్షలు అమెరికా చేయలేదన్నారు. వారు అణు పరీక్షలు చేస్తున్నప్పుడు అమెరికా ఎందుకు చేయని దేశంగా ఉండాలని అన్నారు. ఆ దేశాలు రహస్యంగా భూగర్భంలో పరీక్షిస్తారు వాటి గురించి ప్రపంచానికి తెలియదని చెప్పుకొచ్చారు. ఇంతవరకు బాగానే ఉన్నా, కేవలం పాక్ కూడా అణ్వాయుధ పరీక్షలు చేస్తోందని చెప్పడంలో మతలబు ఉంది. ఇకపోతే రెండో సందర్భంలో పుతిన్, జిన్‌పింగ్ లాంటి కఠినాత్ములు, బలమైన నాయకులు, తీవ్రంగా పరిగణించాల్సిన వ్యక్తులు అని వ్యాఖ్యానించారు. చైనాతో వాణిజ్య ఒప్పందం కుదిరింది కదా అని ఇంటర్వ్యూ చేస్తున్న జర్నలిస్టు ప్రశ్నించగా ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'మేము చైనాని ఓ కంట కనిపెడతాం. వారు అమెరికాను ఎల్లప్పుడూ కనిపెడ్తూ ఉంటారని అన్నారు. గత 8 నెలల కాలంలో 8 యుద్ధాలను ఆపానని, భారత్, పాక్‌ల మధ్య అణుయుద్ధాన్ని నివారించానని మరోసారి వ్యాఖ్యానించారు. ఇప్పటికే ట్రంప్ మీద స్వదేశంలో తీవ్రమైన వ్యతిరేకత వస్తోంది.


విదేశాల్లో కుట్రలు చేస్తున్నారని, భారత్ లాంటి మిత్రదేశాన్ని దూరం చేసుకుంటు న్నారని మండిపడుతున్నారు. ఇవేవీ ఆయన పట్టించుకోవడం లేదు. అంతెందుకు న్యూయార్క్ మేయర్ ఎన్నికల ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో ట్రంప్ డెమొక్రాట్స్ సోషలిస్టు అభ్యర్థి జోహ్రాన్ మమ్దానిపై విమర్శలు చేశారు. అతను సోషలిస్టు కాదు, కమ్యూనిస్టు అని అన్నారు. 'మమ్దాని గెలిస్తే అధ్యక్షుడిగా నేనే నిధులు

కేటాయించను. ఎందుకంటే న్యూయార్క్‌ను నడిపించేది కమ్యూనిస్టు అయినప్పుడు పంపించడం వృథా' అని అక్కసు వెళ్లగక్కారు. డెమొక్రాట్స్‌లో చెడ్డవారు, కమ్యూనిస్టులు ఉంటే నేను చెడ్డవారి పక్కనే నిలబడతానని మరో మేయర్ అభ్యర్థి క్యూమోను ఉద్దేశించి ట్రంప్ పేర్కొన్నారు. ఇలా రాజకీయంగా కూడా ట్రంప్ అమెరికాలో విపరీత వ్యాఖ్యలు చేస్తున్నారు. ఈ సందర్భంగా పాకిస్తాన్ ఇదే అవకాశంగా అణ్వాయు ధాలపై వ్యాఖ్యలు చేసింది. రష్యా, చైనా, ఉత్తరకొరియా, పాకిస్థాన్ వంటి దేశాలు అణ్వాయు ధాలను పరీక్షిస్తున్నాయని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై ఇస్లామాబాద్ స్పందించింది. ఈ విషయంపై పాకిస్థాన్‌కు చెందిన ఓ ఉన్నతాధికారి అంతర్జాతీయ మీడియాకు వివరణ ఇస్తూ.. తామెప్పుడు ఇతర దేశాల కంటే ముందుగా అణు పరీక్షలను పునరుద్ధరించబోమన్నారు. అణు పరీక్షలను నిర్వహించిన మొదటి దేశం పాక్ కాదని.. అదేవిధంగా అణు పరీక్షలను తిరిగి ప్రారంభించే మొదటి దేశంగానూ తాము ఉండబోమని స్పష్టం చేశారు. ఈ విషయంపై చైనా విదేశాంగ మంత్రిత్వశాఖ ప్రతినిధి మావో నింగ్ సైతం స్పందించారు. బాధ్యతాయుతమైన అణ్వాయుధ దేశంగా చైనా ఎల్లప్పుడూ ఆత్మరక్షణ అణువ్యూహాన్ని సమర్థిస్తుందన్నారు. అణు పరీక్షలు నిలిపివేయాలనే విషయంలోనూ తాము అదే నిబద్ధతకు కట్టుబడి ఉంటామన్నారు. అమెరికా చేస్తున్న అణు పరీక్షలను సమర్థించుకున్న ఆ దేశాధ్యక్షుడు ట్రంప్ ఇటీవల సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రపంచంలో చాలా దేశాలు చురుగ్గా అణ్వాయుధాలను పరీక్షిస్తున్నా యన్నారు. ఈ జాబితాలో పాకిస్థాన్ కూడా ఉందని పేర్కొన్నారు. అణ్వాయుధాలకు ఉన్న విధ్వంసకర శక్తి కారణంగా ఆ పరీక్షలు చేయకూడదని గతంలో అధికారంలో ఉన్నప్పుడు నిర్ణయించుకున్నా. ఇప్పుడు పరిస్థితులు మారాయని ట్రంప్ అన్నారు. రష్యా, చైనా సహా ఇతర దేశాలు వేగంగా తమ అణుసామర్థ్యాలను పెంచుకుంటున్న నేపథ్యంలో మళ్లీ అణ్వాయుధ పరీక్షలు ప్రారంభించాల్సిందిగా అమెరికా డిపార్ట్‌మెంట్ ఆఫ్ వార్‌కు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. మొత్తంగా అమెరికా అణుపరీక్షల వ్యవహారం ఎలా ఉన్నా రష్యాచ,చైనాల సరసన పాక్‌ను కూడా చేర్చడం వెనక భారత్‌ను బెదరించే ధోరణిని ట్రంప్ ప్రకటించారు. ఎందుకంటే పాక్‌ను బల్లెంగా ఎగదోసే పనిలో ట్రంప్ బిజీగా ఉన్నాడని గుర్తించాలి. అందువల్ల ట్రంప్‌తో జాగ్రత్తగా ఉండాల్సిందే.

## అమెరికా బాటలో కెనడా

### భారీగా విద్యార్థి వీసాలు తిరస్కరణ

అమెరికా దారిలోనే కెనడా నిర్ణయాలు కూడా ఉంటున్నాయి. కెనడాలో భారతీయ విద్యార్థి వీసాలు భారీగా తిరస్కరణకు గురయ్యాయి. ఉన్నతవిద్య చదివేందుకు దరఖాస్తు చేసుకున్న ప్రతి నలుగురిలో ముగ్గురు విద్యార్థి వీసాలను కెనడా అధికారులు తిరస్కరించారు. దీంతో భారతీయ విద్యార్థుల విషయంలో తీవ్రంగా వ్యవహరిస్తున్నట్లు అర్థం అవుతోంది. కెనడా ఇమిగ్రేషన్ డిపార్ట్‌మెంట్ గణాంకాల ప్రకారం.. 2025 ఆగస్టులో భారతీయ విద్యార్థులు చేసుకున్న దరఖాస్తుల్లో 74 శాతం తిరస్కరణకు గుర య్యాయి. 2023లో ఆ మొత్తం 32 శాతంగా ఉంది. ఇదే సమయంలో చైనా విద్యార్థి వీసాల తిరస్కరణ రేటు 24 శాతంగా ఉండగా.. మిగతా దేశాల సగటు రేటు 40 శాతం మాత్రమే ఉండటం గమనార్హం. అంతర్జాతీయ విద్యార్థి వీసా కార్యక్రమాన్ని కఠినతరం




చేసేందుకు కెనడా ప్రయత్నాలు కొనసాగిస్తోన్న తరుణంలో ఈ భారీ తిరస్కరణలు పెరిగాయి. మరోవైపు భారత్ నుంచి దరఖాస్తు చేసుకుంటున్న విద్యార్థుల సంఖ్య కూడా తగ్గిపోతోంది. విదేశీ విద్యకు అమెరికా తర్వాతి స్థానంలో ఉన్న కెనడా.. గతేడాది దాదాపు 10లక్షల మంది విదేశీ విద్యార్థులకు అవకాశం కల్పించింది. వీరిలో 41శాతం భారత్ నుంచే ఉండగా.. ఆ తర్వాతి స్థానాల్లో చైనా, వియత్నాం దేశాలు ఉన్నట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఇక భారీ స్థాయిలో విద్యార్థి వీసాల దరఖాస్తులను కెనడా తిరస్కరించడానికి అక్కడి స్థానిక పరిస్థితులే కారణమని ఇమిగ్రేషన్ నిపుణులు అంచనా వేస్తున్నారు. నివాస కొరత, మౌలిక సదుపాయాల కల్పన ఇబ్బందిగా మారడం, స్థానిక ఖర్చులు విద్యార్థులు భరించగలరా? అన్న విషయాలపై ఆందోళనల నేపథ్యంలోనే కెనడా ఈ చర్యలు తీసుకుంటున్నట్లు చెబుతున్నారు. మరోవైపు అమెరికా, కెనడాలకు ప్రత్యామ్నాయం చూస్తున్న భారతీయ విద్యార్థులు జర్మనీ వైపు మొగ్గు చూపుతున్నట్లు మరో నివేదిక వెల్లడించింది.

# నైజీరియాలో క్రైస్తవులపై మారణహోమం

నైజీరియాలో దాడులకు అమెరికా సిద్ధపడుతుందనే అను మానాలు బలపడుతున్నాయి. అక్కడి వనరులపై ట్రంప్ కన్ను పడిందన్న ప్రచారం సాగుతోంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సోషల్ మీడియా ట్రూత్‌లో నైజీరియా ప్రభుత్వం క్రైస్తవులను చంపడానికి అనుమతిస్తూనే ఉంది. అక్కడి ఇస్లామిక్ మిలిటెంట్ గ్రూపులు క్రిస్టియన్లపై దాడులు చేస్తున్నాయి. అమెరికా వెంటనే అన్ని సహాయాలను నిలిపేస్తుంది. ఇప్పుడు అమెరికా సైన్యం ఆ దేశంలోకి వెళ్లి ఇస్లామిక్ ఉగ్రవాదులను పూర్తిగా తుడిచిపెట్టే అవకాశం ఉందని పేర్కొన్నారు. దీంతో నైజీరియా ఉలిక్కిపడింది. ఆఫ్రికా ఖండంలో 230 మిలియన్ల అత్యంత జనాభా కలిగిన దేశం నైజీరియా. ఈ జనాబాలో ముస్లింలు, క్రైస్తవులు దాదాపుగా సమానంగా ఉన్నారు. సాయుధ గ్రూపుల ఘర్షణలో అనేక మంది ముస్లిములు అధిక సంఖ్యలో మృతి చెందారు. బొకోహారం వంటి ఉగ్రవాద మూతాల వల్ల అన్ని మతాలవారు మరణిస్తున్నారు. క్రైస్తవులే లక్ష్యం అనేదానికి స్పష్టమైన ఆధారాలు లేకున్నా, క్రైస్తవులు కూడా మరణిస్తున్నారు. నైజీరియా అధ్యక్షుడు బోలా అహ్మద్ టినుబు ట్రంప్ వ్యాఖ్యలను తిరస్కరించారు. తమ దేశంపై మత పరంగా అసహనం వ్యక్తం చేయడం సరికాదన్నారు. తమ ప్రభుత్వం నైజీరియన్లకు మతపరమైన స్వేచ్ఛ కోసం, వారి విశ్వాసాలను కాపాడటానికి కృషి చేస్తుందని పేర్కొన్నారు. పౌరులకు భద్రతను ప్రభుత్వం కల్పిస్తుందని, తీవ్రవాద అంతానికి అమెరికాతో సహా అంతర్జాతీయంగా కలిసి పనిచేస్తామని వెల్లడించారు. నైజీరియాలో సామూహికంగా క్రైస్తవులను హత్యలు చేస్తున్నందున మత స్వేచ్ఛను ఉల్లంఘించే



దేశంగా గుర్తించాలని అమెరికా సెనేటర్ టెడ్ క్రూజ్ గత వారం కాంగ్రెస్‌లో ప్రకటించిన తరువాత ట్రంప్ ఈ బెదిరింపులకు చేయడం గమనార్హం. ట్రంప్ ఉద్దేశం వేరని, రక్షణ సాంకేతికత, పునరుత్పాదక ఇంధనం, విద్యుత్ వాహకాల తయారీకి అవసర మైన లిథియం, కోబాల్ట్, రాగి, లాంధనం, నియోడైమియం, ప్రసోడైమియం వంటి కీలక ఖనిజ నిక్షేపాలు నైజీరియాలో ఉన్నాయని వాటి కోసమే ట్రంప్ బెదిరింపులని పలువురు విశ్లేషిస్తున్నారు.

# ట్రంప్ సుంకాలపై సుప్రీంలో న్యాయవిచారణ

అమెరికా చరిత్రలోనే అత్యంత కీలకమైన న్యాయవిచారణకు అగ్రరాజ్య సుప్రీంకోర్టు సిద్ధమవుతోంది. టారిఫ్‌ల పేరుతో ప్రపంచ దేశాలపై వాణిజ్య యుద్ధం సాగిస్తోన్న అమెరికా




అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారాలను నిర్ణయించే అంశంపై న్యాయస్థానం అమెరికా కాలమానం ప్రకారం బుధవారం విచారణ జరపనుంది. తాజాగా ట్రంప్ టారిఫ్‌లను వ్యతిరేకిస్తూ పిటిషన్లు దాఖలు చేసిన చిన్న వ్యాపారులు, డెమొక్రాట్ పాలిత రాష్ట్రాల కూటమి తరఫున సుప్రీంకోర్టులో వాదనలు వినిపించేందుకు సిద్ధమవుతున్నారు. రెండోసారి అధికారంలోకి రాగానే ట్రంప్ మిత్ర, శత్రు భేదం లేకుండా ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలపై సుంకాలతో విరుచుకుపడిన విషయం తెలిసిందే. అంతర్జాతీయ అత్యవసర ఆర్థిక అధికార చట్టాన్ని ఉపయోగించి ట్రంప్ ఈ సుంకాలు విధించారని అమెరికా సర్కారు తెలిపింది. అయితే, ఈ చట్టాన్ని వినియోగించే క్రమంలో అధ్యక్షుడు ఫెడరల్ చట్టాలను ఉల్లంఘించారనే ఆరోపణలు వచ్చాయి. దీంతో ట్రంప్ నిర్ణయాన్ని కొన్ని న్యాయస్థానాలు అడ్డుకున్నాయి. ఈ క్రమంలోనే అమెరికా ప్రభుత్వం సుప్రీంకోర్టు ను ఆశ్రయించింది. దీనిపై బుధవారం విచారణ జరగనుంది. ఈ కేసులో ట్రంప్‌నకు వ్యతిరేకంగా భారత సంతతి అటార్నీ నీల్ కత్యాల్ వాదనలు వినిపించనున్నారు.

దీంతో ఆయన పేరు ప్రస్తుతం అంతర్జాతీయ మీడియాలో మార్మోగుతోంది. 54 ఏళ్ల నీల్ కత్యాల్ షికాగోలో జన్మించారు. ఆయన తల్లిదండ్రులు భారత్ నుంచి వచ్చిన వలసదారులు. యేల్ లా స్కూల్ నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన నీల్.. మాజీ అధ్యక్షుడు ఒబామా హయాంలో యూఎస్ సొలిసిటర్ జనరల్‌గా వ్యవహరించారు. ఇప్పటివరకు అమెరికా సుప్రీంకోర్టులో 50కి పైగా కేసులను వాదించారు. గతంలో పలుమార్లు ట్రంప్ విధానాలకు వ్యతిరేకంగా నీల్ న్యాయస్థానాల్లో వాదించిన సందర్భాలున్నాయి. 2017లో ట్రంప్ తొలిసారి అధికారంలో కొన్ని దేశాలపై విధించిన ప్రయాణ ఆంక్షలకు వ్యతిరేకంగా నమోదైన కేసులను నీల్ వాదించారు. 'ఇంపీచ్: ది కేస్ అగైనెస్ట్ డొనాల్డ్ ట్రంప్' అనే పుస్తకాన్ని కూడా రచించారు. ఈ కేసు విచారణకు ట్రంప్ ప్రత్యక్షంగా హాజరుకావాలని తొలుత భావించారు. అయితే, కొన్ని కారణాల వల్ల ఆ ఆలోచనను విరమించుకున్నారు. ప్రభుత్వం తరఫున ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెసెంట్ హాజరుకానున్నారు. ఈ కేసు విచారణపై ట్రంప్ సోషల్ మీడియాలో స్పందిస్తూ.. ఇందులో మేం గెలిస్తే.. ప్రపంచంలోనే అత్యంత సంపన్న, సురక్షితమైన దేశంగా అమెరికా నిలుస్తుంది. ఒకవేళ ఓడిపోతే పేద దేశంగా మారుతుంది. అలా జరగొద్దని భగవంతున్ని కోరుకుంటున్నా అని రాసుకొచ్చారు.

# అప్పుడప్పుడు ఎపికి వచ్చి రాజకీయాలు చేయడమేనా..?

ముంథా తుపాన్ కారణంగా రాష్ట్రంలో పంట నష్టపోయిన రైతులను రైతు పరామర్శ యాత్ర పేరుతో వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ రాజకీయం చేయడాన్ని మంత్రి నారా లోకేశ్ తప్పు పట్టారు. జగన్ పరామర్శ యాత్రపైమంత్రి నారా లోకేశ్ తన శైలిలో వ్యంగ్య బాణాలు సంధించారు. అప్పుడప్పుడు ఆంధ్రప్రదేశ్‌కు వచ్చే జగన్ గారు.. ఎప్పుడూ జనం మధ్య ఉండే మా వైపు ఒక వేలెత్తి చూపిస్తున్నారన్నారు. అయితే మీ వైపు నాలుగు వేళ్లు చూపిస్తున్నాయనే విషయాన్ని మర్చిపోతున్నా రంటూ చురకలంటించారు. తుపాన్ హెచ్చరిక వచ్చిన నాటి నుంచి సాధారణ పరిస్థితి నెలకొనే వరకు ముఖ్యమంత్రి నుంచి ఎమ్మెల్యే వరకు.. అలాగే చీఫ్ సెక్రటరీ నుంచి విలేజ్ సెక్రటరీ వరకు అంతా ప్రజల చెంతే ఉన్నామని పేర్కొన్నారు. అలా ప్రజలను ఆదుకున్నామని తెలిపారు. ఇవన్నీ మీకు తెలియడానికి మీరు ఇక్కడ లేరంటూ నారా లోకేశ్ వ్యంగ్యంగా అన్నారు. మీది వేరే భ్రమాలోకం.. అందులో విహరిస్తుంటే.. ఇవన్నీ తెలియవని జగన్‌కు తెలిపారు. తనకు మహిళలంటే గౌరవమని.. అలాగే దేశమంటే భక్తి అని ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. అందుకే మహిళల వరల్డ్ కప్ ÷నైల్ మ్యాచ్ చూడటానికి ముంబై వెళ్లానన్నారు. కోట్లాది భారతీయులు తలెత్తుకునేలా మహిళామణులు వరల్డ్ కప్ గెలిస్తే.. తాను గెలిచినంతగా ఆనందించానని పేర్కొన్నారు. సొంత తల్లి, చెల్లిని తరిమేసిన మీకు దేశభక్తి, మహిళా శక్తి గురించి ఏం తెలుస్తుందిలే! అంటూ జగన్ వైఖరిని మంత్రి నారా లోకేశ్ ఎండగట్టారు. ఇకపోతే రైతు పరామర్శ పేరుతో వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ రెడ్డి డీజేలు పెట్టి పార్టీ జెండాలతో ఊరేగటానికే వచ్చాడంటూ మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత దేవినేని ఉమామహేశ్వర రావు మండిపడ్డారు. రైతు కష్టంలో ఉంటే.. నేషనల్ హైవేపై టెంట్లు వేసుకుని రెడ్ కార్పెట్ మీద ఫొటోషూట్లు చేశాడంటూ జగన్ వైఖరిపై నిప్పులు చెరిగారు. మంగళవారం విజయవాడలో దేవినేని ఉమా విలేకర్లతో మాట్లాడుతూ.. మొంథా తుఫాను సమయంలో రైతుల కష్ట సమయంలో వారికి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌తోపాటు కూటమి ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. వైఎస్ జగన్ మాత్రం ప్యాలెస్‌లో



పడుకున్నాడంటూ విమర్శించారు. గత ప్రభుత్వం పంటల బీమా సైతం ఇవ్వ లేదంటూ జగన్ నిర్వాకాన్ని కేంద్ర మంత్రి పార్లమెంట్లో ఎండగట్టిన విషయాన్ని ఈ సందర్భంగా దేవినేని ఉమా గుర్తు చేశారు. జగన్ హయాంలో 60 లక్షల ఎకరాల్లో వేల కోట్ల మేర పంట నష్టం జరిగితే.. కానీ పరిహారం లేదన్నారు. అన్ని విషయాల్లో అబద్దాలే ఎక్కువ అంటూ మాజీ సీఎం జగన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్షంలో చంద్రబాబు నేలపై కూర్చుని నీ మెడలు వంచి రైతుల కోసం రూ. 590 కోట్ల బీమా ప్రీమియం చెల్లించేలా చేశారన్నారు. కేంద్రం ఇచ్చిన రూ. 3, 600 కోట్లు కూడా రైతుల ఖాతాల్లో జమ చేయలేని నిర్వాకం జగన్‌దన్నారు. 2024?25లో కూటమి ప్రభుత్వం 7.65 లక్షల మంది రైతుల వద్ద నుంచి రూ.12,857 కోట్లకు ధాన్యం కొనుగోలు చేసి 24 గంటల్లో వారి ఖాతాల్లో నగదు జమ చేసిందని గుర్తు చేశారు. అన్నదాత సుఖీభవ కింద రూ.3,174 కోట్ల నగదు రైతుల ఖాతాల్లో జమ చేశారని వివరించారు. త్వరలో రెండో విడత నిధులు కూడా రానున్నాయని పేర్కొన్నారు. ఉల్లి, పొగాకు, మామిడి, టమాట రైతులను కష్టకాలంలో ఆదుకున్న ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. జగన్ పాలనలో పోర్టల్‌లో కూడా తప్పుడు కోతలు, తప్పుడు డేటానే ఉందని విమర్శించారు. నేడు వచ్చి రైతు పరామర్శ పేరుతో కబుర్లు చెబుతున్నాడంటూ వైఎస్ జగన్ వైఖరిపై దేవినేని ఉమా ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్ల వైసీపీ హయాంలో 9 విపత్తులు, రూ. 20 వేల కోట్ల నష్టం వచ్చిందన్నారు. కానీ రైతుల వద్దకు ఆయన వెళ్లలేదంటూ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో వైఎస్ జగన్ వైఖరిని ఎండగట్టారు. అబద్దాలతో కాలం గడిపాడంటూ జగన్‌పై మండిపడ్డారు. రైతులకు జగన్ బకాయిలుగా పెట్టిన రూ. 1,700 కోట్ల ధాన్యం నగదును కూటమి ప్రభుత్వం చెల్లించిందని గుర్తు చేశారు. దాన్యం నగదులో కక్కుర్తి పడి ప్యాలెస్‌కు గడ్డం గ్యాంగ్‌తో వైఎస్ జగన్ తరలించాడని పేర్కొన్నారు.

# కార్తీక మాసంలో అత్యంత పవిత్రమైన రోజు

శివకేశవులకు ప్రీతిపాత్రం పౌర్ణమి

ఏడాదిలో పవిత్రమైన మాసాలు చాలానే ఉన్నాయి. అయితే కార్తీక మాసం అత్యంత పవిత్రమైనది. ఈ మాసంలో అన్ని రోజులు పవిత్రమైనవే. ఈ మాసంలో వచ్చే కార్తీక పౌర్ణమి.. మహాశివరాత్రితో సమానమైన రోజని పండితులు చెబుతారు. ఈ పౌర్ణమి.. శివకేశవులు ఇద్దరికి అత్యంత ప్రీతికరమైన రోజని అంటారు. అలాంటి ఈ కార్తీక పౌర్ణమి వేళ.. భక్తులంతా 365 వత్తులతో శివాలయంలో దీపారాధన చేస్తారు. కార్తీక పౌర్ణమి.. మహాశివరాత్రితో సమానమని పండితులు చెబుతారు. అందుకే పౌర్ణమిరోజు సముద్ర, నదీ స్నానాలకు భక్తులు పోటెత్తుతారు. అనంతరం ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేస్తారు. అందులో భాగంగా.. 365 వత్తులతో దీపారాధన చేస్తారు. ఇక ఈ రోజు.. కేదారేశ్వర స్వామి, సత్యనారాయణ స్వామి వ్రతాలు, కార్తీక నోములు సైతం భక్తి శ్రద్ధలతో నోచుకుంటారు. ఈ రోజు ఈ పూజలు చేయడం వల్ల విశేష ఫలితాలను భక్తులు అందుకుంటారు. కార్తీక పౌర్ణమి రోజు తెల్లవారు జామునే నిద్ర లేచి.. పవిత్ర స్నానం ఆచరించి పరమ శివుడు, మహా విష్ణువు, శ్రీలక్ష్మిని పూజించాలి. నదిలో దీపాలను దానం చేస్తే మంచిది. అలా కుదరకుంటే ఆలయంలోనైనా దీపాన్ని దానం చేయాలి. విష్ణు సహస్ర నామాలతోపాటు లలితా సహస్ర నామాలు సైతం పారాయణం చేస్తే మంచి జరుగుతుంది. చంద్రుడికి పచ్చిపాలను నీటిలో కలిపి అర్పిస్తే విశేష ఫలితాలు పొందవచ్చు. కార్తీక పౌర్ణమి వేళ.. గోదానం చేయడం వల్ల మంచి ఫలితాలు అందుకోవచ్చు. బెల్లం, దుస్తులను పేదలకు దానం చేయడం వల్ల శుభం జరుగు తుంది. ఇలా దీపం వెలిగించడం వల్ల పుణ్యం లభిస్తుందంటారు. అంటే ఏడాదికి 365 రోజులు. ఒక్కోరోజుకు ఒక్కో వత్తిగా పరిగణిస్తారు. ఈ దీపాలను అరటి దోసలో పెట్టి నదులు, దేవాలయాల్లోని కోనేటిలలో వదులుతారు. ఈ పౌర్ణమి రోజు దీపం వెలిగిస్తే.. అశ్వమేధయాగం చేసినంత ఫలితం లభిస్తుందంటారు. ఈ 365 వత్తులను ఇంటి ముందు తులసికోట వద్ద వెలిగిస్తే.. సర్వదోషాలు తొలగిపోతాయని చెబుతారు. ఈ కార్తీక పౌర్ణమి రోజు.. మృత్యుంజయ మంత్రాన్ని పఠించాలని భక్తులకు పండితులు సూచిస్తున్నారు. అది కూడా 108 సార్లు పఠించాలని స్పష్టం చేస్తున్నారు. అలా చేయడం వల్ల రోగాలు దరి చేరవని పేర్కొంటారు. వివాహమైన యువతులు ఇలా దీపాలు వెలిగించడం వల్ల వారి కుటుంబానికి మంగళకరమని విశ్వసిస్తారు. కార్తీక పౌర్ణమి రోజు శివాలయాల్లో జ్వాలాతోరణం వెలిగిస్తారు. ఈ తోరణం కింద నుంచి వెళ్లడం వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుందని భక్తులు నమ్ముతారు. పాల సముద్రంలో పుట్టిన విషాన్ని పరమేశ్వరుడు మింగిన తర్వాత వేడిని తట్టుకోలేక పోతాడు. ఆ వేడిని తగ్గించమంటూ అగ్ని దేవుడిని పార్వతీ దేవి వేడుకుంటుంది. దాంతో తన సహజ స్వభావాన్ని అగ్ని కొంత మేర తగ్గిస్తాడు. అందుకు అగ్నికి పార్వతి దేవి కృతజ్ఞతలు తెలుపుతుంది. అందులో భాగంగా కార్తీక



పౌర్ణమి రోజు పార్వతి దేవి జ్వాలా తోరణం కడుతుంది. ఆ తోరణం కింద నుంచి భార్యాభర్తలిద్దరు వెళ్లారు. నాటి నుంచి కార్తీక పౌర్ణమి రోజు.. శివాలయాల్లో జ్వాలాతోరణాలు ఏర్పాటు చేయడం అనవాయితీగా మారింది. ఈ రోజు శివాలయాల్లో జ్వాలాతోరణం చూసిన వారికి మరో జన్మ ఉండదని భక్తులు విశ్వసిస్తారు. జ్వాలా తోరణం కాల్చిన తర్వాత మిగిలిన బూడిదను నుదుటిన పెట్టుకుంటే భూత, ప్రేత, పిశాచాల పీడ ఉండదని చెబుతారు. పౌర్ణమి రోజు చంద్రుడు నిండుగా కాంతివంతంగా కనిపిస్తాడు. ఇక ఈ కార్తీక పౌర్ణమి రోజు చంద్రుడి కిరణాలు శరీరం మీద పడితే నరాలు, కళ్లకు సంబంధించిన సమస్యలు దూరమవుతాయని పెద్దలు చెబుతారు. ఏడాదిలో మిగిలిన పౌర్ణమిల కంటే.. చంద్రుడు మరింత కాంతివంతంగా ఉంటాడు. ఈ నేపథ్యంలో ఈ రోజు ఐదు నిమిషాల పాటు చంద్రుడి కాంతి శరీరంపై పడేలా భక్తులు చూసుకోవాలని పండితులు సూచిస్తున్నారు.



## ప్రజా సమస్యలను గాలికి వదిలేసిన ప్రజాప్రతినిధులు

**శేరిలింగంపల్లి, నవంబర్ 04, (అక్షరగళం):** ప్రజల సమస్యలను ప్రజా ప్రతినిధులు పట్టించుకోకుండ గాలికి వదిలేశారు. హాఫీస్ పెట్ డివిజన్ పరిధిలోని మంజీరా రోడ్డులో గల స్ప్రింగ్ వ్యాల్యూ స్కూల్ ముందు గత రెండు రోజుల నుండి డ్రైనేజీ పొంగి రోడ్డుపైన కలుషితమైన నీరు వెళుతున్న కానీ కనీసం అధికారులను పురమాయించని ప్రజా ప్రతినిధులు ఒక్కసారి ఆలోచించండి ప్రజలారా నిరంతరం ప్రజల కోసం పోరాటం చేసే మిద్దెల మల్లారెడ్డి ఇట్టి సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి దగ్గరుండి క్లియర్ చేయించి ప్రజలకు మురికి నీరు వలన ఎలాంటి విష జ్వరాలు రాకుండా కాపాడడం జరిగిందన్నారు. ప్రజలారా మీకు దగ్గరుండి ఎల్లవేళలా సేవలను అందిస్తానని తెలియపరుస్తూ ఎక్కడ ఏ సమస్య ఉన్న నాకు ఫోన్ చేయగలరని మనవి చేసుకుంటున్నాను నా శేష జీవితాన్ని ప్రజల శ్రేయస్సు కొరకే అంకితం చేస్తానని మాట ఇస్తున్నాను ఎక్కడ ఏ సమస్య ఉన్న నాకు ఫోన్ చేయగలరని మరొకసారి ప్రజలకు మనవి చేసుకుంటున్నానుఎక్కడ ఏ సమస్య ఉన్న నాకు ఫోన్ చేయగలరని మరొకసారి ప్రజలకు మనవి చేసుకుంటున్నాను.




## ఇళ్ల మధ్య వైన్‌షాపు తొలగించాలి

**సీడీఎంఏకు,ఎక్సైజ్ కమిషనర్‌కు కాలనీవాసుల వినతి : నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కొకుట్ల చంద్రారెడ్డి**

**కీసర,నవంబర్ 04,(అక్షర గళం):** నాగారం మున్సిపాలిటీ పరిధిలోని సత్యనారాయణ కాలనీలో ఇళ్ల మధ్యలో వైన్ షాపు తొలగించాలని మహిళలు స్థానిక ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఈ విషయమై నాగారం మున్సిపాలిటీ మాజీ ఛైర్మన్ కొకుట్ల చంద్రారెడ్డి తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్ కమిషనర్‌కు ఫిర్యాదు సమర్పించారు. సుమారు 400 కుటుంబాలు నివసిస్తున్న ఈ కాలనీ పక్కనే కృష్ణవేణి టాలెంట్ స్కూల్, క్రాంతి చిల్డ్రన్స్ హాస్పిటల్, బస్టాండ్, శుక్రవారం మార్కెట్ వంటి ముఖ్యమైన ప్రజా ప్రాంతాలు ఉండగా, ప్రజలు, ముఖ్యంగా మహిళలు మరియు విద్యార్థులు ప్రయాణించే ప్రధాన రహదారిపై వైన్ షాప్ ఏర్పాటు చేయడం ప్రజల భద్రతకు ముప్పుగా మారుతుందని ఆయన తెలిపారు.అంతే కాకుండా నందమూరి తారకరామారావు, దొడ్డి కొమరయ్య విగ్రహాలు ఉన్న గౌరవనీయ మైన స్థలానికి సమీపంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయడం సముచితం కాదని పేర్కొన్నారు. ఇప్పటికే మున్సిపాలిటీ మరియు మేడ్చల్ జిల్లా కలెక్టర్‌కు కూడా ఫిర్యాదులు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణం జరుగుతుండటంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రజల సంక్షేమం కోసం ఈ ప్రతిపాదిత వైన్‌షాప్‌ను వెంటనే రద్దు చేసి స్థానిక ప్రజలకు న్యాయం చేయాలని ఎక్సైజ్ శాఖను చంద్రారెడ్డి కోరారు.

మందుబాబులు అక్కడే మద్యం తాగి ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. స్థానిక కాలనీలవాసులు కూడా ఈ కద లికకు మద్దతు తెలుపుతూ త్వరితగతిన స్పందించాలని అధికారులు స్పందించి వెంటనే మార్పు చేయాలని డిమాండ్ చేశారు.



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము
పురపాలక సంఘం కార్యాలయము - నాగారం
మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా, తెలంగాణ రాష్ట్రం.

కొకుట్ల చంద్రారెడ్డి
చైర్‌పర్సన్ (నాగారం మున్సిపాలిటి)
మొబైల్ : 9399973494

తేది : 4/11/25

శ్రీ.........

Date:04-11-2025

శ్రీయుత గౌరవనీయులైన ప్రొహిబిషన్ ఎక్సైజ్ కమిషనర్ ఆఫ్ తెలంగాణ గారికి

విషయము : నూతనంగా ఏర్పాటు చేస్తున్న వైన్ షాపు గురించి.

అయ్యా

నేను అనగా కొకుట్ల చంద్రారెడ్డి మాజీ చైర్మన్ నాగారం మున్సిపాలిటీ నా యొక్క విన్నపము ఏమనగా, నాగారం మున్సిపాలిటీ, సత్యనారాయణ కాలనీ లో సుమారుగా 400 కుటుంబాలు నివాసము ఉంటున్నారు. రాంపల్లి మెయిన్ రోడ్డు నుండి నాగారం వెళ్లే దారిలో సత్యనారాయణ కాలనీ వద్ద కొత్తగా వైన్ షాప్ పెడుతున్నారు. దీనికి దగ్గరలో కృష్ణవేణి టాలెంట్ స్కూల్, క్రాంతి చిల్డ్రన్స్ హాస్పిటల్, బస్టాండ్ మరియు శుక్రవారం మార్కెట్ సంత ఉన్నాయి. ఈ యొక్క మార్గం కూడలి వద్ద మహనీయుల విగ్రహాలు కీర్తిశేషులు నందమూరి తారక రామారావు గారి, దొడ్డి కొమరయ్య గారి విగ్రహాలు ఉన్నాయి. అలాగే ఈ మార్గం గుండా పలు కాలనీలకు కనెక్టివ్ కూడా ఉంది. శివ సాయి ఎంక్లేవ్, వెంకట్ రెడ్డి కాలనీ, జర్నలిస్ట్ రాఘవ కాలనీ, శ్రీనివాస నగర్, భాగ్యనగర్ బొడ్డ నగర్, హనుమాన్ నగర్, రవీంద్ర నగర్, ఓంసాయి నగర్, లోటస్ కాలనీ అన్నమయ్య కాలనీ, చక్రధర, శిల్పా నగర్, మోడీ అపార్ట్మెంట్స్ ,లక్ష్మి నగర్, ప్రభాకర్ ఎంక్లేవ్, రామకృష్ణ నగర్, విజ్ఞాన్ స్కూల్, సాయి దిశా స్కూల్ మరియు అన్నపూర్ణ కాలనీలకు ఈ మార్గం మాత్రమే ఉంది వైన్స్ వలన ప్రజలకు మహిళలకు ఉద్యోగం చేస్తున్న మహిళలకు ఈ వైన్ షాప్ ఇబ్బందికరంగా ఉంటుంది. విద్యార్థులు వైన్ షాప్ ముందు నుండి నడవాల్సి వస్తుంది. ఇట్టి వైన్ షాప్ యొక్క ప్రదేశంలో అక్రమంగా కట్టడం జరుగుతుంది. ఇదివరకే నాగారం మున్సిపాలిటీలో ఇట్టి విషయమై ఫిర్యాదు చేయడం జరిగినది. మరియు మేడ్చల్ జిల్లా గౌరవనీయులైన కలెక్టర్ గారికి కూడా ఫిర్యాదు ఇవ్వడం జరిగినది. ఈ వైన్ షాప్ ప్రభుత్వనిబంధనలకు విరుద్ధంగా ప్రజలు నివసిస్తున్న కాలనీలలో ఏర్పడుతున్నందున వెంటనే దానిని తొలగించి సత్యనారాయణ కాలనీ మరియు ఇతర కాలనీల ప్రజలకు తగు న్యాయం చేయగలరని మనవి చేయుచున్నాను.

ఇట్లు
కొకుట్ల చంద్రారెడ్డి మాజీ చైర్మన్ నాగారం
మున్సిపాలిటీ, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా.

O/o. COMMISSIONER PROH. & EXCISE
GOVT. OF TELANGANA
04 NOV 2025
INWARD
NAMPALLY, HYDERABAD-01



### ఫాం హౌస్ నుండే వస్తలేడు..

## అధికారంలోకి ఎలా వస్తాడు?

- జూబ్లీహిల్స్‌లో భారీ మెజార్టీతో కాంగ్రెస్ పార్టీ గెలవబోతుంది
- రెండేళ్లలో కేసీఆర్ వస్తారు అనే కేటీఆర్ మాటలు అర్థరహితం
- ఎన్నికల ప్రచారంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

**హైదరాబాద్:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా రహ్మత్ నగర్ డివిజన్, PJR టెంపుల్ వద్ద రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ కు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పేదల మేలు కోరే కాంగ్రెస్ హస్తం గుర్తుపై ఓటు వేసి అభ్యర్థి నవీన్ యాదవ్ ను గెలిపించాలని జూబ్లీహిల్స్ ఓటర్లను కోరారు.

ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ... "కాళేశ్వరం ప్రాజెక్టును కమిషన్ల కోసం పూర్తి చేశారు, కానీ రాష్ట్రంలో మరో పెద్ద ప్రాజెక్టు కూడా పూర్తి కాలేదు" అని గత పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనను విమర్శించారు.

"కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం ఈ మూడు సంవత్సరాలు కాదు, రాబోయే ఐదేళ్లు కూడా సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోనే కొనసాగుతుంది" అని స్పష్టం చేశారు. పేరుకే జూబ్లీహిల్స్ కానీ ఇక్కడ ఎక్కువగా పేద ప్రజలే నివసిస్తున్నారు. వారందరికీ అభివృద్ధి ఫలాలు అందేలా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోంది అని చెప్పారు.

బీఆర్ఎస్ నాయకుల వ్యాఖ్యలను వ్యంగ్యంగా ఎత్తిచూపుతూ, "కేటీఆర్ చెబుతున్నట్టు రెండు సంవత్సరాల్లో ప్రభుత్వం మారుతుందట, కానీ కెసిఆర్ ఇప్పుడు ఫార్మ్‌హౌస్ లోకి వెళ్లి బయటకు రారు" అని వ్యాఖ్యానించారు. ప్రజలు, బుద్ధిజీవులు, మేధావులు ఆలోచన చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటేనే కొట్లాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రానికి మేలు జరుగుతుందన్నారు. జూబ్లీహిల్స్ ప్రజల ఆశీర్వాదంతో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ భారీ మెజారిటీతో గెలవబోతున్నారని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. మంత్రి వెంట ఎమ్మెల్యేలు బాలు నాయక్, వేముల వీరేశం, పలువురు కాంగ్రెస్ నేతలు ఉన్నారు.

### నైపుణ్య మార్పిడితో

## ఉమ్మడి పురోగతికి అడుగులేద్దాం

- ఐటీ, ఫార్మా, క్రీడల్లో సహకారానికి 'తెలంగాణ' సంసిద్ధం
- స్టార్టప్స్ కు మార్గ నిర్దేశం... జీనోమ్ వ్యాలీని సందర్శించండి
- క్యూబా రాయబారితో భేటీలో మంత్రి శ్రీధర్ బాబు పిలుపు

**హైదరాబాద్:** ద్వైపాక్షిక సహకారం ద్వారా నైపుణ్యాలను పరస్పరం ఇచ్చిపుచ్చుకొని ఉమ్మడి పురోగతి వైపు కలిసి అడుగేద్దామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పిలుపునిచ్చారు. 'తెలంగాణ - క్యూబా' మధ్య సత్సంబంధాలను పెంపొందించేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. క్యూబా రాయబారి జువాన్ కార్లోస్ మార్సన్ అగులేరా, ఫస్ట్ సెక్రటరీ మిక్కీ డియాజ్ పెరెజ్ తో ఆయన మంగళవారం డా.బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. బయో టెక్నాలజీ, ఫార్మా, హెల్త్ కేర్, ఐటీ, ఏఐ, ఇన్నోవేషన్, అగ్రికల్చర్, సస్టైనబుల్ ఫార్మింగ్, స్పోర్ట్స్ ఎక్స్ లెన్స్, కల్చర్ తదితర అంశాల్లో ద్వైపాక్షిక సహకారం (Bilateral Cooperation), నైపుణ్య మార్పిడికి (Expertise Sharing) గల అవకాశాలపై చర్చించారు. అంతర్జాతీయ భాగస్వామ్యాల ద్వారా తెలంగాణను దేశంలోని ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్ గా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున చేస్తున్న కృషిని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు వివరించారు.

టీ-హబ్, టీ-వర్క్స్, వీ-హబ్ ద్వారా క్యూబా స్టార్టప్స్ కు మార్గనిర్దేశం చేసేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందన్నారు. ఏఐ ఆధారిత డయాగ్నోస్టిక్స్, ఫార్మా రీసెర్చ్, పబ్లిక్ హెల్త్ డేటా తదితర అంశాల్లో సహకారం అందిస్తామన్నారు. ప్రపంచంలోని టాప్- 7 లైఫ్ సైన్సెస్ క్లస్టర్లలో ఒకటిగా నిలిచిన 'జీనోమ్ వ్యాలీ'ని సందర్శించాలని క్యూబా ప్రతినిధులను ఆహ్వానించారు. బాక్సింగ్, అథ్లెటిక్స్‌లో క్యూబా నైపుణ్యాన్ని తెలంగాణకు అందించాలని కోరారు.

నూతన ఆవిష్కరణలు, ఇన్నోవేషన్ డ్రివెన్ ప్రోగ్రెసివ్ విధానాలను అవలంభిస్తున్న తెలంగాణ లాంటి రాష్ట్రాలతో కలిసి పని చేసేందుకు ఆసక్తిగా ఉన్నామని క్యూబా రాయబారి జువాన్ కార్లోస్ మార్సన్ అగులేరా పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ఇన్వెస్ట్ మెంట్ అండ్ ప్రమోషన్ సెల్ డైరెక్టర్ మధుసూదన్, తెలంగాణ లైఫ్ సైన్సెస్ ఫౌండేషన్ డైరెక్టర్ శక్తి నాగప్పన్ తదితరులు పాల్గొన్నారు.







## ఎంపీ వద్దిరాజు మాజీ మంత్రి తీగుళ్లతో కలిసి యూసఫ్‌గూడలో కాలినడకన ప్రచారం

**హైదరాబాద్:** బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర మాజీ మంత్రి, ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావు గౌడ్, సీనియర్ నాయకులు ఆశీస్ కుమార్ యాదవ్, పుస్తె శ్రీకాంత్ తదితర ప్రముఖులతో కలిసి యూసఫ్ గూడలో మంగళవారం సాయంత్రం కాలినడకన విస్తృత ప్రచారం నిర్వహించారు.

ఎంపీ రవిచంద్ర, పద్మారావు గౌడ్, ఆశీస్ కుమార్ యాదవ్, శ్రీకాంత్ లు పార్టీ శ్రేణులు, అభిమానులు, మహిళలు, మైనారిటీలు పెద్ద సంఖ్యలో వెంట రాగా యూసఫ్ గూడ డివిజన్ లక్ష్మీనరసింహ నగర్, కృష్ణానగర్ తదితర చోట్ల పార్టీ అభ్యర్థి మాగంటి సునీతకు ఓటేసి గెలిపించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. గల్లీ గల్లీ తిరుగుతూ ఇంటింటికి,షాపుల వద్దకు వెళ్లి గోడలు,గేట్లకు స్టికర్స్ అంటిస్తూ,కరపత్రాలు పంచుతూ, నమూనా ఇవీఎంలలో 3వ నంబరులో ఉన్న బీఆర్ఎస్ కారు గుర్తుకు ఓట్లు వేసి విజయం చేకూర్చాల్సిందిగా ఓటర్లను అభ్యర్థించారు.

ఈ ప్రచార కార్యక్రమంలో కార్పొరేటర్ హేమ,పార్టీ సీనియర్ నాయకులు వాసాల వెంకటేష్, పర్వతం సతీష్, పవన్ రెడ్డి, మీర్ రహత్ అలీ తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్‌కు నోటి విలువ తెలియదు.. నీటి విలువ తెలియదు

**- ఎవరు గోబెల్స్? ఎవరు నియంతలు?**

**- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి**

**హైదరాబాద్:** ఏవైనా పొరపాట్లు ఉంటే ఎత్తి చూపవచ్చు. కానీ నిత్యం నిందాపూర్వక ఆరోపణలు చేస్తున్నారు. ఏం చేస్తారో చెప్పకుండా ఇప్పుడు కూడా కేసీఆర్ మీద, హరీష్ రావు మీద ఆరోపణలు, విమర్శలు చేస్తున్నారు. రాజకీయాల్లో పార్టీలకు, వ్యక్తులకు మధ్య భిన్నాభిప్రాయాలు, విశ్వాసాలు ఉంటాయి. అంతమాత్రానా ఇష్టమున్నట్లు ఎదుటివారిని తూలనాడడం అనేది కుసంస్కారాన్ని తెలియజేస్తుంది. ప్రజాస్వామ్య పీఠం మీద కూర్చున్న సీఎం నేను ఇలాగే మాట్లాడతాను అంటే అంతకుమించిన అపరిపక్వత ఇంకోటి ఉండదు. వనరులు సమీకరించు కుంటూ కేంద్ర జలవనరుల నిపుణులు ప్రశంసించినట్లు ఇంజనీరింగ్ మార్వెల్ కాళేశ్వరం నిర్మించారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో పంప్‌హౌస్‌లు, సొరంగాలు, రిజర్వాయర్ల నిర్మాణాలతో 90 శాతం పనులు పూర్తి చేశాం.

కాలువల నిర్మాణానికి టెండర్లు పిలిచాం ఈ లోపు ఎన్నికలు వచ్చాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లయినా పిడికెడు మట్టి తీయలేదు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చే నాటికి, కాంగ్రెస్ పాలనలో ఉన్న పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేశాం. 46 వేలకు పైగా చెరువులు, కుంటలు పునరుద్దరించి, వేలాది చెక్ డ్యాంలు నిర్మించుకున్నాం.

తన పనిలో తానుండి తెలంగాణను ఆదర్శప్రాయంగా నిలపాలనే ప్రయత్నాలలో ఉండగా అపాయింట్ మెంట్ ఇవ్వలేదని ఒకరు, పనికాలేదని ఒకరు కేసీఆర్ మీద విషం చల్లారు. కావాలనే బద్నాం చేశాం అని ఒక మంత్రి, కావాలనే కేసీఆర్‌కు వ్యతిరేకంగా వ్యూహాత్మ



కంగా ప్రచారం చేశామని మరికొందరు స్వయం ప్రకటిత మేధావులు చెబుతున్నారు. కాంగ్రెస్ పార్టీ పాలనలో రెండేళ్లలో వాళ్ల కలలు కల్లలయ్యాయి. ఇప్పుడు బుద్ధితక్కువై అలా చేశాం అని చెబుతున్నారు. వ్యూహాలను ఎవరైనా నిర్మాణం కోసం ఉపయోగిస్తారు. విధ్వంసానికి వ్యూహం పన్నేవారు వీరేం మేధావులు ? టన్నుల కొద్దీ వీళ్లు కక్కిన విషం మూలంగా ప్రస్తుతం మరో తరం నష్టపోయే పరిస్థితి వచ్చింది. దీనిని తెలంగాణ జాతి ఎన్నడూ వారిని క్షమించదు. క్షమార్హం కాని ద్రోహం తెలంగాణ సమాజానికి చేశారు. ఒక మనిషి మీద కోపం ఉంటే ఒక వ్యవస్థ పాడు కావడానికి వీరు చేసిన చర్యలు అత్యంత దుర్మార్గం

శ్రీశైలం ప్రాజెక్టు ఉద్దేశమే వెయ్యి మెగా వాట్ల హైడ్రో ఎలక్ట్రికల్ ప్రాజెక్టు. కాలక్రమంలో అనేక ప్రయోగాలతో తెలంగాణను ఎండబెట్టి అవతలి ప్రాంతానికి నీళ్లు ఇవ్వడానికి కుట్రలు పన్నారు. తెలంగాణ నేతలు కొందరు ఆంధ్రా వాళ్ల కబంధ హస్తాల్లో ఉన్నారు. ఈ కుట్రలు ఎవరైనా చెప్పినా ప్రజలకు వివరాలు తెలియకుండా చేస్తున్నారు. రేవంత్ రెడ్డికి విషయాలు తెలియవు. నీళ్ల మంత్రికి నల్లగొండ తప్ప మరో విషయం తెలియదు. సీనియర్ మంత్రిగా తెలంగాణకు మేలు చేసే అవకాశం ఉన్నా చేయడం లేదు. 1982 జులై 29న కాంగ్రెస్ ప్రభుత్వం జీఓ నంబర్ 306 విడుదల చేశారు. శ్రీశైలం నీళ్లను ఎడమ, కుడి వైపులకు ఎన్ని నీళ్లను వాడుకునే అవకాశం ఉందో అధ్యయనం చేయాలని ఆదేశాలు ఇచ్చింది. దాని మీద చీఫ్ ఇంజనీర్ ఇచ్చిన రిపోర్ట్ ప్రకారం శ్రీశైల రైట్ బ్యాంక్ కెనాల్ ద్వారా కర్నూలు, కడప జిల్లాలకు 2.75 లక్షల ఎకరాలకు, శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ ద్వారా నల్లగొండ జిల్లాకు 3 లక్షల ఎకరాలకు సాగునీటిని అందించాలని నిర్ణయించారు. శ్రీశైలం రెండు వైపులా ఉన్న భౌగోళిక పరిస్థితుల ప్రకారం సొరంగాలు తీయాల్సిందే. అటు వైపు గ్రావిటీ ప్రకారం నీళ్లు వెళ్తాయి. 1.9.1983 ఎన్టీఆర్ ప్రభుత్వంలో జీఓ నంబర్ 368 విడుదల చేస్తూ లెఫ్ట్ బ్యాంక్ వైపు అటవీ ప్రాంతం ఉంది. టన్నెల్ కు పర్యావరణ సమస్యలు వచ్చే అవకాశం ఉందని జీఓలోనే పేర్కొన్నారు. టన్నెల్ ద్వారా నాగార్జున సాగర్ బ్యాక్ వాటర్ నుండి ఎలిమినేటి మాధవరెడ్డి ఎత్తిపోతలను ప్రతిపాదించారు

1994లో ఎస్సెల్బీసీకి కేంద్రం పర్యావరణ అనుమ తులు ఇచ్చింది. మరి 2014 వరకు టీడీపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు ఎస్సెల్బీసీ టన్నెల్‌ను ఎందుకు పూర్తి చేయలేదు ? 2004లో జలయజ్ఞంలో భాగంగా ఎస్సెల్బీసీ పనులు ప్రారంభించారు. చరిత్ర తెలియకుండా రేవంత్ రెడ్డి మాట్లా డడం బాధ్యతారాహిత్యం. లెఫ్ట్ బ్యాంక్ కెనాల్‌కు సమాం తరంగా కుడి వైపు ప్రకాశం జిల్లా కొల్లం వద్ద రివర్స్ టన్నెల్ పెట్టి పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు అని పేరు పెట్టారు

నల్లగొండకు నీళ్లిచ్చే ఎస్సెల్బీసీ టన్నెల్ పొడవు 42 కిలోమీటర్లు. కుడివైపు టన్నెల్ పొడవు 38 కిలోమీటర్లు. ఒకటే శ్రీశైలం ప్రాజెక్టు కింద ఉన్న రెండు టన్నెల్లలో అదే నల్లమల అడవిలో ఉన్న పనులలో కుడిపక్కకు లేని పర్యావరణ ఇబ్బందులు ఎడమవైపుకు ఎలా వచ్చాయి? అటు వైపు టన్నెల్ ఎలా పూర్తయింది ? ఇటు వైపు ఎందుకు ఆగిపోయింది? మీ వైఫల్యమే ఈ దుస్థితికి కారణం. అది మరిచిపోయి కేసీఆర్ మీద నిందలేస్తారా?

కాంగ్రెస్ హయాంలో ఈపీసీ ద్వారా కాంట్రాక్టర్లకు పనులు ఇచ్చారు. తెలంగాణ వచ్చాక పనులు త్వరగా చేసుకుందాం అంటే పనులు రద్దు చేయకుండా పీఠముడి వేశారు. ఎస్సెల్బీసీలో ఆడిట్ సిస్టం లేకుండా పనులు చేపట్టడం దుర్మార్గం. ఎలుకలు కూడా కొంచెం దూరి తవ్వి లోపలికి గాలి వచ్చేందుకు మరో బొక్క పెడతాయి. కానీ ఇందులో అది లేదు.

కాంగ్రెస్ మిడిమిడి తెలివితో ఎనిమిది మంది ప్రాణాలను బలిగొన్నది. ఇప్పుడు ఏం చేస్తారో చెప్పకుండా మళ్లీ విమర్శలు చేయడం సిగ్గు చేటు. పోతిరెడ్డిపాడును వ్యతిరేకిస్తూ టీఆర్ఎస్ అప్పట్లో ప్రభుత్వం నుండి బయటకు వచ్చింది. కేసీఆర్ మంత్రి పదవికి రాజీనామా చేశారు.40 రోజులు శాసనసభను స్థంభింప చేశాం. పాలమూరు రంగారెడ్డిలో మిగిలిపోయిన పది శాతం పనులను పూర్తి చేయడం లేదు. మళ్లీ కొడంగల్, నారాయణ పేట ఎత్తిపోతల చేపట్టారు. దానికి అసలు నీటి కేటాయింపులే లేవు. భీమాకు ఉన్న నీళ్ల కేటాయింపు నుండే 5 టీఎంసీలు దానికి కేటాయించారు. దానిని నికర జలాలు అని పేర్కొనడం అవగాహనా రాహిత్యానికి నిదర్శనం.

రూ.27 వేల కోట్లు పాలమూరు రంగారెడ్డికి ఖర్చు పెట్టి నీళ్లివ్వలేదని ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడడం సిగ్గు చేటు. కేసులు వేసి అడ్డుకున్న మేధావులు ఎంత మంది ? అన్ని పనులు పూర్తి చేసి పెడితే కాలువలు తవ్వకుండా నీళ్లు ఇవ్వలేదని చెప్పడం అవివేకం. కేఎల్ఐ మోటారు ఏడాదిలో దాదాపు 200 రోజుల వరకు నడుస్తుంటే, భీమా, నెట్టెంపాడు, కోయిల్ సాగర్ కేవలం 50 నుండి 60 రోజులు మాత్రమే నడుస్తున్నాయి.

ఆర్డీఎస్‌ను కాంగ్రెస్ నాశనం చేస్తే కేవలం 11 నెలలలో తుమ్మిళ్ల ఎత్తిపోతల పూర్తి చేసి నీళ్లందించాం. కాంగ్రెస్ నేతలు వాగడం తప్ప రెండేళ్లలో ఒక్క వాగు మీద చెక్ డ్యామ్ నిర్మించలేదు. చేతనయితే చెప్పిన పనులు, ఇచ్చిన హామీలు చేసి చూపించాలి.

కాంగ్రెస్ పాలనలో పత్తిని అమ్ముకోలేక రైతులు తగులబెట్టుకుంటున్నారు. వరంగల్ వరదల్లో నష్టపోయిన వారిని గాలికి వదిలేశారు. వచ్చిన ఒక ఉప ఎన్నిక చుట్టూ ముఖ్యమంత్రి, మంత్రులు తిరుగుతున్నారు. తెలంగాణ భవన్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్ గౌడ్, బీసీ కమీషన్ మాజీ సభ్యుడు కిశోర్ గౌడ్, మాజీ జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు తదితరులు పాల్గొన్నారు.



# రాజాసాబ్ సంక్రాంతికి రావడం పక్కా..

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న తాజా చిత్రాల్లో ది రాజాసాబ్ సంక్రాతికి పక్కా అని నిర్మాత తేల్చి చెప్పారు.. మారుతీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నాడు. ఈ చిత్రంలో మాళవిక మోహన్, నిధి అగర్వాల్, రిద్ది హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి రిలీజైన పోస్టర్స్, టీజర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకు న్నాయి. ఇక ఎప్పుడెప్పుడు ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుందా అని అభిమానులు వెయ్యి కళ్ళతో ఎదురుచూస్తున్నారు. ఇక ప్రభాస్ సినిమా అంటే వాయిదా లేకుండా రిలీజ్ ఉండదు అని చెప్పడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. ది రాజాసాబ్ కూడా అదే తరహాలో వరుస వాయిదాలు పడుతూ వస్తుంది. డిసెంబర్ 5 న అనుకున్న సినిమా మరోసారి వాయిదా పడి సంక్రాంతి బరిలో దిగింది. జనవరి 9 న ది రాజాసాబ్ రిలీజ్ కు సిద్ధమవుతుంది. ఇక గతకొన్నిరోజులుగా సంక్రాంతి నుంచి కూడా రాజాసాబ్ తప్పుకుందని వార్తలు వస్తున్నాయి. తాజాగా రాజాసాబ్ వాయిదా రూమర్స్ ను నిర్మాత టీజీ విశ్వప్రసాద్ ఖండించాడు. కచ్చితంగా రాజుగారు సంక్రాంతికి వస్తున్నారని తెలిపారు. ప్రమోషన్స్ కూడా మొదలుపెట్టనున్నట్లు.. డిసెంబర్ లో అమెరికాలో ప్రీ రిలీజ్ ఈవెంట్ చేయనున్నట్లు చెప్పుకొచ్చారు. ఇలాంటి పుకార్లను నమ్మకుండా ఉండాలని అభిమానులను కోరాడు. ప్రసుతం ఈ పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారింది. మరి ఈ సిని మాతో ప్రభాస్ ఎలాంటి విజయాన్ని అందుకుంటాడో చూడాలి.

# పెద్దిలో మొహిత్ చౌహాన్ పాట

రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు సాన దర్శకత్వం వహిస్తున్న 'పెద్ది' సినిమా ప్రమోషన్స్ షురూ అయ్యాయి. సినిమాకు సంబంధించి ఏదో ఒక అప్‌డేట్ ఇస్తూ సినిమాపై అంచనాలు పెంచుతున్నారు. తాజాగా కథానాయికగా నటిస్తున్న జాన్వీ కపూర్ ప్రమోషనల్ వీడియోలో రెహమాన్ కూడా కనిపించబోతున్నారు. చికిరి పాటకి సింగర్ గా మోహిత్ చౌహాన్‌ను ఎంపిక చేశారాయన. హిందీలో ఆయన ఎన్నో హిట్ చిత్రాలకు పాటలు పాడారు. అక్కడ ఆయన ఎంతో పాపులర్. 'రాక్ స్టార్' సినిమాలో



క్యారెక్టర్ రివీల్ చేస్తూ పోస్టర్ రిలీజ్ చేశారు. అలాగే ఫస్ట్ సింగిల్ టైటిల్ కూడా తెలిపారు. ఈ పాట 'చికిరి' అనే లైన్‌తో ఉంటుందని తెలిసింది. ఈ విషయాన్ని స్వయంగా ఎ.ఆర్.రెహమాన్ వెల్లడించారు. దర్శకుడు, సింగర్ మోహిత్ చౌహాన్‌తో కలిసి కీ బోర్డ్ ముందుకు కూర్చున్న ఫొటోను రామ్‌చరణ్ షేర్ చేసి ఏం వండుతున్నారు గయ్స్' అని ట్వీట్ చేశారు. దానికి 'చికిరి చికిరి.. చరణ్‌గారు' అంటూ సంగీత దర్శకుడు ఏ.ఆర్.రెహమాన్ రిప్లై ఇచ్చారు. దర్శకుడు కూడా అదే సమాధానమిచ్చారు. ప్రస్తుతం ఎక్స్‌లో వీరి సంభాషణ నెట్టింట వైరల్ మారింది. పాట కోసం ఎంతగానో ఎదురుచూస్తున్నట్లు అభిమానులు పోస్ట్‌లు పెడుతున్నారు. అయితే ఈ పాట మొత్తం 15 పాట ఉంటే అందులో తొమ్మిది పాటలిన మోహిత్ ఛౌహాన్‌తోనే పాడించారు రెహమాన్. దాంతో ఆయన పేరు పాపురల్ అయింది. మోహిత్ తెలుగు సంగీత దర్శకులతో ఎక్కువ పని చేయలేదు కానీ తమిళ సినిమా పాటల్ని తెలుగులో పాడారు. ఆయన వాయిస్ కాస్త డిఫరెంట్‌గా ఉంటుంది. దర్శకుడు నాగ్ అశ్విన్‌కు ఆయనపై ప్రత్యేక అభిమానంతో 'ఎవడే సుబ్రహ్మణ్యం' సినిమాలో 'ఇదేరా' అంటూ సాగే పాటను పాడించారు. తర్వాత డైరెక్ట్ తెలుగు సినిమా పాడిన సందర్భం లేదు. ఇప్పుడు 'పెద్ది' సినిమాతో తెలుగులో మళ్లీ పాడుతున్నారు. అయితే పెక్యులర్ వాయిస్ చికిరి పాటకు కొత్తదనం తీసుకొస్తుందని టీమ్ బలంగా నమ్ముతోంది.




## థ్రిల్లర్ మూవీలో మీనాక్షి చౌదరి

ప్రముఖ నటి మీనాక్షి చౌదరి కొత్త పాత్రకు సంబంధించిన పోస్టర్ విడుదలైంది. నాగచైతన్య హీరోగా 'విరూపాక్ష' దర్శకుడు కార్తీక్ దండు ఓ సినిమా తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో మీనాక్షి చౌదరి హీరోయిన్. సోమవారమే ఈ సినిమాలో ఆమె పాత్రకు సంబంధించిన ఫస్ట్ లుక్ ను విడుదల చేస్తామని నిర్మాత బి.వి.ఎస్.ఎన్. ప్రసాద్ తెలిపారు. అయితే చేవెళ్ళ బసు దుర్ఘటనతో దానిని ఈ రోజుకు వాయిదా వేశారు. ఆ ప్రకారంగా మీనాక్షి చౌదరి ఫస్ట్ లుక్ పోస్టర్స్ ను మేకర్స్ రిలీజ్ చేశారు. ఇంకా పేరు పెట్టని ఈ మిథికల్ థ్రిల్లర్ మూవీలో దక్ష అనే ఆర్కియాలజీ సైంటిస్ట్ పాత్రను మీనాక్షి చౌదరి చేస్తోంది. తాజా విడుదలైన పోస్టర్ చూస్తుంటే... ఈ పాత్ర సినిమాలో చాలా కీలకమైందనేది అర్థమౌతోంది. దర్శకుడు సుకుమార్ సైతం నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ సినిమాతో 'లాపతా లేడీస్' ఫేమ్ స్పర్శ్ శ్రీవాస్తవ టాలీవుడ్ ఎంట్రీ ఇస్తున్నాడు. ప్రముఖ కన్నడ సంగీత దర్శకుడు అజనీశ్ బి. లోకనాథ్ దీనికి సంగీతం అందిస్తున్నాడు.

## దుల్కర్ సల్మాన్..కాంత మూవీ

మాలీవుడ్ స్టార్ దుల్కర్ సల్మాన్ నటిస్తోన్న సినిమా కాంత పీరియాడిక్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కు తున్న ఈ చిత్రాన్ని సెల్వమణి సెల్వరాజ్ డైరెక్ట్ చేస్తున్నాడు. ఈ పాన్ ఇండియా సినిమా నుంచి ఇప్పటికే లాంచ్ చేసిన పోస్టర్, టీజర్‌కు మంచి స్పందన వస్తోంది. ఈ మూవీని నవంబర్ 14న విడుదల చేస్తున్నారు. ఇటీవలే రేజ్ ఆఫ్ కాంత ట్రాక్‌ను విడుదల చేయగా సినిమాపై హైప్ క్రియేట్ చేస్తోంది. ఈ సాయంత్రం 4 గంటలకు తొలిమెరుపు ఉండబోతుందని నేడు కొత్త పోస్టర్ లాంచ్ చేశారు. దుల్కర్ సల్మాన్, భాగ్యశ్రీ బోర్సే, సముద్రఖని రోల్స్‌తో డిజైన్ చేసిన పోస్టర్ నెట్టింట వైరల్ అవుతుండగా.. ఇంతకీ ఆ తొలి మెరుపు ఏంటనేది క్లారిటీ రానుంది. ఇప్పటికే కాంత మూవీ నుంచి అమ్మాడివే సాంగ్‌ను విడుదల చేశారని తెలిసిందే. దుల్కర్ సల్మాన్, భాగ్యశ్రీ బోర్సే కాంబోలో వచ్చే ఈ మెలోడీ ట్రాక్ మ్యూజిక్ లవర్స్‌ను ఇంప్రెస్ చేస్తోంది. భారతీయ సినిమాలో 1960ల నాటి గత యుగానికి నివాళిగా తెరకెక్కుతున్న కాంత సినిమాకు దుల్కర్ సల్మాన్‌తోపాటు టాలీవుడ్ యాక్టర్ రానా దగ్గుబాటి వన్ ఆఫ్ ది ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నాడు.



# పిఠాపురంలో..అలా మొదలయ్యింది



తొలి చిత్రం 'ప్రేయసి రావే'తోనే దర్శకునిగా తన సత్తా చాటుకున్నారు మహేష్ చంద్ర అయోధ్య రామయ్య, చెప్పాలని వుంది, జోరుగా హుషారుగా, ఒక్కడే, హనుమంతు, ఆలస్యం అమృతం, రెడ్ అలర్ట్ సినిమాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. తాజాగా ఆయన రూపొందించిన చిత్రం 'పిఠాపురంలో'.

'అలా మొదలైంది' అనేది ఉపశీర్షిక. రాజేంద్రప్రసాద్, పృధ్వీరాజ్, కేదార్ శంకర్, మణిచందన, జయవాహిని, అన్నపూర్ణమ్మ తదితరులు ముఖ్య తారాగణంగా ఈ చిత్రం రూపొందింది. మహేష్ చంద్ర ప్రొడక్షన్స్ బ్యానర్‌పై దుండిగల్ల బాలకృష్ణ, ఆకుల సురేష్ పటేల్, ఎఫ్‌ఎం మురళి నిర్మిస్తున్నారు. షూటింగ్ పార్ట్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్‌ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుపుకుంటోంది. సందర్భంగా దర్శకుడు మహేష్‌చంద్ర మాట్లాడుతూ 'కుటుంబ భావోద్వేగాలు కలగలిసిన ప్రేమకథ ఇది. ఇందులో మూడు జంటల ప్రేమకథలు చూడొచ్చు. ముగ్గురు తండ్రుల పెంపకాల్లోని లోటుపాట్లనీ చూడొచ్చు. ప్రేక్షకులు ఏదో ఒకరకంగా ఈ కథతో కనెక్ట్ అవుతారు. ఈమధ్య కాలంలో 'పిఠాపురం' అనేది ఎంతలా మారుమోగిందో అందరికీ తెలిసిందే. ఆ పిఠాపురం నేపథ్యంలోనే సినిమా అంతా సాగుతుంది. పిఠాపురం పరిసర ప్రాంతాల్లో 28 రోజులు, హైదరాబాద్‌లో 15 రోజులు, గోవాలో 6 రోజులు చిత్రీకరణ జరిపాం. ఇందులో మొత్తం మూడు పాటలు ఉంటాయి. గోవాలో ఒక పాటను, హైదరాబాద్‌లో సెట్‌వేసి ఇంకో పాటను, సూరంపాలెంలోని ఆదిత్య కాలేజ్‌లో మరో పాటను చిత్రీకరించాం. దర్శకునిగా నాకు జీవితాన్ని ప్రసాదించిన రామానాయుడు గారి స్ఫూర్తితో కథను నమ్మి, ఎక్కడా వేస్టేజ్ లేకుండా ఈ సినిమా తీశాం. త్వరలోనే రిలీజ్ డేట్ ప్రకటిస్తాం' అని తెలిపారు.

PUBLISHED BY G.KALPANA AND PRINTED AT YAGNA PRINTERS AND PUBLICATIONS, H.NO 18-105/4, OPP HANUMANPET, MALKAJGIRI(M)MEDCHAL- 500047, MEDCHAL MALKAJGIRI DISTRICT,TELANGANA PUBLISHED FROM H.NO02-66/254,MALLAREDDY NAGAR PHASE 1, GAJULARAMARAM, QUTHBULLAPUR, MEDCHAL-500055, DISTRICT MALKAJGIRI ,TELANGANA, EDITOR : G.DAYAKAR REDDY , RNI :TELTEL/2022/83927, PHONE NUMBER 9908293393,040- 45046154